ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
3
శుక్రవారం 14 మార్చి 2025




ఓవర్ లోడ్ కారణంగా తెనాలి వైకుంఠపురం బ్రిడ్జి వద్ద రోడ్డుపై పడి ప్రమాదకరంగా మారిన ఇసుక

మార్చిలోనే మంటలు

● మొదలైన భానుడి ప్రతాపం ● 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు ● మే నెలను తలపించేలా ఎండలు ● ఉదయం 9 నుంచే వేడి.. జనం ఉక్కిరిబిక్కిరి

(గుంటూరు(తూర్పు), నరసరావుపేట,ఆంధ్రజ్యోతి)

మార్చి రెండో వారంలోనే భానుడు ప్రతాపం చూపుతు న్నాడు. పగటి ఉష్ణోగ్రతలు అంతకంతకు పెరిగిపోతు న్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు ప్రాంతాల్లో గురువారం 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత పెరుగుతోంది. దీంతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఇప్పుడే ఎండ తీవ్రత ఈ స్థాయిలో ఉంటే మేలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పెరుగుతున్న ఎండలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మధ్యాహ్న సమయంలో రోడ్లు జనసంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. అత్యవసర పనులకు మాత్రమే ఇళ్లలో నుంచి ప్రజలు బయటకు వస్తున్నారు. రానున్న వారం రోజులు ఇదేస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని వాతావరణశాఖ ప్రకటించింది. సాధారణ ఉష్ణోగ్రత 35 డిగ్రీలు కాగా 7 డిగ్రీలు అధికంగా నమోదు కావడం ఆందోళన కలిగిస్తున్నది. రెంటచింతల, నరసరావుపేట ప్రాంతాలలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోద య్యాయి. గుంటూరు జిల్లాలో అత్యధికంగా 41 డిగ్రీలు, బాపట్ల జిల్లాలో అత్యధికంగా 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



గురువారం నమోదైన ఉష్ణోగ్రత వివరాలు

ప్రాంతం	ఉష్ణోగ్రత డిగ్రీలలో
రెంటచింతల	42
మాచర్ల	42
గురజాల	42
దాచేపల్లి	42
నరసరావుపేట	42
పిడుగురాళ్ళ	42
వినుకొండ	42
సత్తెనపల్లి	41
చిలకలూరిపేట	40
గుంటూరు	41
మంగళగిరి	41
తాడేపల్లి	41
తెనాలి	39
బాపట్ల	37
చీరాల	37
రేపల్లె	33

జాగ్రత్తలు తీసుకోవాలి..

పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇంటి నుంచి బయ టకు వెళ్లే సమయంలో కనీస జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. ఎండలో బయటకు వెళ్లే వారు నీటిని ఎక్కువగా తాగాలని, రక్షణగా గొడుగు వాడితే మంచిదంటున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల్లోపు సాధ్యమైనంత వరకు ఇంటి నుంచి బయటకు రాకూడదని హెచ్చరిస్తున్నారు. ముక్కు, చెవులకు వస్త్రం చుట్టుకోవడం మంచిదంటున్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఎండలో పనిచేసే వారు తగిన జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. మజ్జిగ కొబ్బరి నీళ్ల పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలని సూచి స్తున్నారు. ద్విచ క్ర వాహనంపై ఎక్కు వ దూరం ప్రయా ణించ రాదన్నారు.


మరమ్మతుల కోసం ఫ్రిజ్‌లను తరలిస్తున్న దృశ్యం

ఉచితం.. అనుచితం

ఇష్టారీతిన ఇసుక వినియోగం

బంగారంలాంటి ఇసుక వృథా అవుతోంది. ఉచితం పేరుతో కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఇసుకను కొందరు దుర్వినియోగం చేసేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.వేలకు వేలు వెచ్చించి కొనుగోలు చేసిన ఇసుక ఇప్పుడు అందుబాటు ధరలో లభిస్తుండటంతో ఇష్టం వచ్చినట్లుగా వినియోగిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇసుక కారణంగా నిర్మాణదారులు పడిన కష్టాలు తీర్చేందు కోసం కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టి సామాన్యులకు సైతం అందుబాటులో ధర ఉండేలా చేస్తే కొందరు దానికి విలువ లేకుండా చేస్తున్నారు. తక్కువ ధరకే ఇసుక లభిస్తోండటంతో ఇష్టమొచ్చినట్లు వాడేస్తున్నారు. రియల్టర్లు వెంచర్లను మట్టికి బదులు ఇసుకతో మెరక చేసుకుంటున్నారు. వాహనదారులు పరిమితికి మించి ఇసుకను నింపుకుని వెళ్తుండటంతో అదంతా జారిపోయి రోడ్లన్నీ ఇసుకతో నిండిపోతున్నాయి. ఈ ఇసుక కారణంగా ద్విచక్ర వాహనాలు జారి ప్రమాదాలు చోటుచేసు కుంటున్నాయి. ఇసుక దుర్వినియోగం అవుతున్నా.. వృథాగా రోడ్డు పాలవుతున్నా.. అధికారులు పట్టించుకోవడంలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉచిత ఇసుకను దుర్వినియోగం, వృథా చేసిన వారిపై కేసులు నమోదు చేయగా ప్రస్తుతం ఆ ఊసే ఎక్కడా కనిపించడం లేదు.


ఉచిత ఇసుకతో ప్లాట్ల మెరక

తెనాలి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ఇసుక కష్టాలతో నిర్మాణ దారులు అల్లాడిపోయారు. ఇసుక అందు బాటులో లేక కూలీలకు పనులు కూడా దొరకలేదు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఇసుకను ఉచితం చేసి నిర్మాణ దారులకు ఇబ్బందులు లేకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంది. భవన నిర్మాణాలకు ఇసుక కావాలంటే గత వైసీపీ ప్రభుత్వం లో రూ.లక్షలు ఖర్చుపెట్టాల్సిన పరిస్థితి ఉంటే ప్రస్తుతం కేవలం నామమాత్రపు కూలి ఖర్చులు చెల్లించి, సీనరేజ్ లేకుండా అందుతోంది. గతానుభవాల దృష్ట్యా ఇసుక ను జాగ్రత్తగా వాడుకోవాలి. అయితే కొం దరు దానిని దుర్విని యోగం చేస్తుండగా.. మరికొందరి నిర్లక్ష్యం కారణంగా వృథా అవుతోంది. తక్కువ ధరకే ఇసుక లభి స్తోండటంతో ఇష్టమొచ్చినట్లు వాడేస్తు న్నారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో లారీ ఇసుక రూ.20 వేల నుంచి రూ.28 వేల వరకు పలికింది. ఇప్పుడు అదే ఇసుక రూ.6 వేల నుంచి రూ.9 వేలలోపు వచ్చే స్తుండటంతో దానికి విలువ లేకుండా పో యింది. సాధారణంగా రియల్టర్లు వెంచర్ల మెరక కోసం ఎర్రమట్టి లేక బుసక మన్ను ను వినియోగిస్తుంటారు. అయితే మట్టి, బుసక ధరకే ఇసుక వస్తుండటంతో దాని నే మెరకకు వాడుతున్నారు. దీంతో బం గారం లాంటి ఇసుక కట్టడాలకు ఉపయో గపడకపోగా, భూగర్భంలో కప్పబడిపో తోంది. అనుచితంగా ఉపయోగించేస్తుండ టంతో భవిష్యత్‌లో కొరత ఏర్పడే పరిస్థితి కనిపిస్తోంది.

వాల్టా ఉల్టా


రీచ్‌ల్లో కూలీలతో వాహనాలకు ఇసుకను లోడ్ చేయాల్సిన కాంట్రాక్టర్లు లారీలను నేరుగా నదిలోకి దింపేసి ఎక్స్‌కవేటర్లతో తోడి పోసేస్తు న్నారు. వాల్టా చట్టం ఉల్టా అవుతుండగా గ్రీన్‌ట్రిబ్యునల్ ఆదేశాలు నదిలో కలసిపోతున్నాయి. అయినా అధికారులు రీచ్‌ల వైపు కన్నెత్తి చూడటంలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో నిబంధనలు పూర్తిగా తుంగలో తొక్కారనుకుంటే, ఇప్పుడు వాటికి మించి ఉల్లంఘ నలు జరుగుతున్నాయి. నదిలోని నీరు బయటకు వచ్చేలా పది నుంచి 15 అడుగుల వరకు లోతుపెట్టి తవ్వేస్తున్నారు. దీంతో నదీ తీర గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి వేసవి మొదలు కాకముందే నీటికి కటకట ఏర్పడుతోంది.

వృథాతో పాటు ప్రమాదాలు

ప్రకాశం బ్యారేజి దిగువున గుండిమెడ, పెదకొండూరు, అత్త లూరివారిపాలెం, బొ మ్మువానిపాలెం రీచ్ లు గడువు ముగిసి మూతపడగా ప్రస్తుతం గాజుల్లంక రీచ్‌కు ఒక్క దానికే అనుమతులు

(మిగతా 4వ పేజీలో)

● తక్కువ ధరకు వస్తుందని వెంచర్ల మెరకలకూ..
● పరిమితికి మించి లోడింగ్‌తో రోడ్లపై జారిపోతున్న ఇసుక
● ఇసుక మయంగా మారిన రహదారులపై నిత్యం ప్రమాదాలు
● టీడీపీ ప్రభుత్వంలో దుర్వినియోగం చేసిన వారిపై కేసులు
● అధికారుల నిర్లక్ష్యం.. రీచ్‌ల్లో ఇష్టారీతిన ఇసుక తవ్వకాలు


ఓవర్ లోడ్‌తో ఇసుక లారీ

కాసులిస్తే.. కావల్సినంత

నదిలోని ఇసుకను కూలీలతో ట్రాక్టర్లకు లోడ్ చేయించి ఒడ్డుకు తీసుకొచ్చి నిల్వ పోసి ఎక్స్‌కవేటర్‌తో లారీల్లో నింపాలనేది నిబంధన. ఇలాగైతే ఇసుకను పరిమితికి మించి పోయకుండా కొలత ప్రకారం పోసి డబ్బు తీసుకునేవారు. కానీ కూలీలతో పనిలేకుండా భారీ యంత్రాలను నేరుగా నదిలోకే దింపేసి, ఇసుకను ఇష్టమొచ్చినట్లు పోస్తున్నారు. అది ఎంతగా అంటే మార్గమధ్యలో లారీల నుంచి రోడ్లపైకి కారిపోయేటంత. ఆరు చక్రాల లారీకి 18 టన్నులు, 10 చక్రాల లారీకి 24 టన్నుల వరకు అనుమతిస్తుంటే, 6 చక్రాల లారీలో 25 నుంచి 30 టన్నుల వరకు, 10 చక్రాల లారీలో 40 టన్నుల వరకు, ఇక 12 చక్రాల లారీల్లో అయితే 40 నుంచి 60 టన్నులపైనే ఇసుక పోసేస్తున్నారు. అదనంగా పోసిన ఇసుకకు అదనంగా డబ్బు దోచేస్తున్నారు.

రూ.20 కోట్లతో.. చార్జింగ్ స్టేషన్

◆ ఆర్టీసీ-2 డిపో గ్యారేజ్‌లో ఏర్పాటుకు కసరత్తు
◆ త్వరలో గుంటూరుకి 100 ఎలక్ట్రిక్ బస్సులు

గుంటూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): త్వరలో గుంటూరు ఆర్టీసీకి వంద వరకు ఎలక్ట్రిక్ బస్సులు రానున్న నేపథ్యంలో అందుకు అవసరమైన పనులు ముమ్మరం చేశారు. రూ.20 కోట్లపైనే నిధులు అవసరం అవుతాయని డీపీటీవో రవికాంత్, నెల్లూరు జోన్ ఈడీ నాగేంద్రప్రసాద్, ఇంజనీరింగ్ అధికారులు అంచనాలు సిద్ధం చేసినట్లు తెలిసింది. ఇటీవల కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఎన్టీఆర్ బస్టాండ్‌లో పర్యటించి ఎలక్ట్రిక్ బస్సులకు సౌకర్యాలు, చార్జింగ్ స్టేషన్ వంటి అంశాలపై అధికారు లకు దిశానిర్దేశం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రెండో డిపో గ్యారేజ్ లో చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణ యించారు. వరద నీరు చేరకుండా గ్యారేజ్ ఎత్తు ఆరు అడుగుల మేర పెంచాలని, అందుకోసం సివిల్, ఎలక్ట్రిక్ పనుల అంచనాలను రూపొంది స్తున్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా బస్టాండ్ చెరువును తలపిస్తోంది. ఈ నేపథ్యంలో ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు.

గుంటూరు-2 డిపోకు బస్సులు..

కేంద్ర ప్రభుత్వం నుంచి పీపీపీ పద్ధతిలో త్వరలో రానున్న ఎలక్ట్రిక్ బస్సులు గుంటూరు-2 డిపోకు కేటాయించనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం గుంటూరు-2 డిపోలో 80 సర్వీసులను వేర్వేరు డిపోలకు బదిలీ చేయనున్నట్లు సమాచారం. ఎలక్ట్రిక్ బస్సులు వచ్చాక గుంటూరు-2 డిపోకు కేటాయించి గుంటూరు-విజయవాడతో పాటు రద్దీ ప్రాంతాలకు ఆయా బస్సులను సర్దుబాటు చేస్తామని ఓ అధికారి తెలిపారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.23 (శుక్రవారం)
సహరి : 5.00 (శనివారం)

నేత్రపర్వం.. నృసింహుని కల్యాణం

● స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి లోకేశ్ దంపతులు ● నేడు మంగళగిరి తిరునాళ్ల


4
స్వామివార్లకు పట్టువస్త్రాలు, తలంబ్రాలను తీసుకెళ్తున్న మంత్రి లోకేశ్ దంపతులు

శ్రీవారి కల్యాణంతో అమరావతి పునర్నిర్మాణం

● 27 వేల మంది భక్తులు హాజరవుతారని అంచనా
● 300 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు - 3 వేల వాహనాలకు పార్కింగ్
● ఆలయ ప్రాంగణం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం..
● టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడి



తుళ్లూరు : వెంకటపాలెం వేంకటేశ్వరస్వామి కల్యాణానికి కుర్చీలు వేసి సిద్ధం చేసిన ఆవరణ

4



ట్రిపుల్ ఎక్స్ సోప్ అధినేత మాణిక్యవేల్ కన్నుమూత

4


వెంకటపాలెం ఆలయ ఆవరణలో శ్రీవారి కల్యాణానికి సిద్ధమైన వేదిక

పట్టాలెక్కనున్న.. వైకుంఠపురం బ్యారేజి

◆ పురుడు పోసుకుంటున్న అమరావతి ఐకానిక్ ప్రాజెక్టు ◆ కీలక ప్రాజెక్టుపై తాజాగా అసెంబ్లీలో మంత్రి నిమ్మల ప్రకటన ◆ గత ప్రభుత్వంలో ఐకానిక్ బ్రిడ్జిలకు చంద్రబాబు శంకుస్థాపన ◆ ఉద్దేశపూర్వకంగా జగన్ ప్రభుత్వం నాడు రద్దు.. నేడు పెరిగిన నిర్మాణ వ్యయం

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి, అమరావతి)

రాజధానికి గేట్ వేగా.. అమరావతివాసు లకు తాగునీటి వనరుగా.. పర్యాటక రంగ అభివృద్ధికి కేంద్రంగా.. వరదనీరు సముద్రంలోకి వృథాగా పోకుండా.. కృష్ణానదిపై వైకుంఠపురం వద్ద గత టీడీపీ ప్రభుత్వం నిర్మించాలనుకున్న బ్యారేజి ఎట్టకేలకు పట్టాలెక్కనున్నది. అత్యద్భుత అమరావతి.. భావి అవసరాలు.. రాష్ట్రాభివృద్ధి ప్రణాళికల నేపథ్యంలో నాడు చంద్రబాబు ఆలోచనల నుంచి పుట్టుకొచ్చిన కీలక ప్రాజెక్టులు మళ్లీ పురుడు పోసుకుంటున్నాయి. ఈ క్రమంలో కృష్ణానదిపై వైకుం ఠపురం వద్ద బ్యారేజి కమ్ బ్రిడ్జిని నిర్మించాలని గత టీడీపీ ప్రభుత్వం ప్రతిపా దించింది. దీంతో 2019 ఫిబ్రవరి 13న ఇప్పటి ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పవిత్రసంగమం(ఫెర్రీ)-గుంటూరు జి ల్లా తుళ్లూరు మండలం లింగాయపాలెం గ్రామాల మధ్య ఐకానిక్ బ్రిడ్జిని నిర్మించేందుకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థా పన చేశారు. నవయుగ కనస్ట్రక్షన్స్ సంస్థ నిర్మాణ పనులను ప్రారంభించింది. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ రాజధాని అమరావతితో పాటు ఈ బ్యారేజి నిర్మాణాన్ని కూడా ఉద్దేశపూర్వకంగా రద్దు చేసి అటకెక్కించిం ది. ఇంతటి కీలక ప్రాజెక్టుపై తాజాగా కూటమి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. వైకుంఠపురం బ్యారే జి నిర్మాణంపై గురువారం అసెంబ్లీ సమావేశాల్లో జ లవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటన చేశారు. బ్యారే జి విషయంలో అన్ని అ నుమతులను సాధించి టెండర్లను పిలిచి పనుల ను కూడా కొంతమేర ఆరం భించామని గుర్తుచేశారు. బ్యారేజీ నిర్మాణాన్ని పట్టాలెక్కిం చేందుకు కొత్తగా డీపీఆర్‌ను తయారు చేయనున్నట్లు ప్రకటించారు. 15 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహాన్ని తట్టుకునే లా బ్యారేజిని నిర్మించాలనుకుంటున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. నవ్య రాజధా ని అమరావతి నిర్మాణానికి కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులు ముందు కు వేస్తున్న క్రమంలో ఈ బ్యారేజి అంశం తెరపైకి రావడంతో రాజధానివాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


నాడు రూ.2,400 కోట్లు.. నేడు రూ.4 వేల కోట్లు

ఆరేళ్ల జాప్యం జరుగుతున్న కారణంగా బ్యారే జి నిర్మాణఖర్చు తడిసి మోపెడవనున్నది. ఇంచు మించే ఈ వ్యయం యాభైశాతాన్ని మించిపోయే అవ కాశం ఉంది. జగన్ నిర్వాకం కారణంగా ఈ అదనపు వ్యయాన్ని రాష్ట్ర ప్రజలు మోయక తప్పని పరిస్థితు లు ఉత్పన్నమయ్యాయి. గతంలో రూ.2,400 కోట్ల తో పూర్తయ్యే ఈ ప్రాజెక్టుకు ఇప్పుడు రూ.4 వే ల కోట్ల వరకు ఖర్చు చేయాల్సి వస్తుం దని అంచనా వేస్తున్నారు.

నిర్మాణం జరిగితే ఎంతో మేలు..

రాజధాని అమరావతికి గేట్ వేగా ఉంటుందన్న అంచనాల నేపథ్యంలో వైకుంఠపురం వద్ద కృష్ణానదిపై తలపెట్టిన ఐకానిక్ బ్రిడ్జి ప్రకాశం బ్యారేజికి ఎగువున 23 కి.మీ, అమరావతికి దిగువన 7కి.మీ దూరంలో

(మిగతా 4వ పేజీలో)



ఐకానిక్ బ్రిడ్జి ఊహచిత్రం


2019లో బ్యారేజికి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న చంద్రబాబు


విద్యుత్ వెలుగుల్లో వెంకటపాలెంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం

స్వామివారి కల్యాణంతో

అమరావతి పునర్నిర్మాణం

- 27 వేల మంది భక్తులు హాజరవుతారని అంచనా
- 300 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు.. 3వేల వాహనాలకు పార్కింగ్
- ఆలయ ప్రాంగణం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం..
- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడి

తుళ్లూరు (వెంకటపాలెం), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతం వెంకటపాలెం గ్రామంలోని వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఈ నెల 15న వైభవంగా నిర్వహిస్తున్నామని, అందుకు ఏర్పాట్లుపూర్తిచేశామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. గురువారం వెంకటేశ్వరస్వామి సన్నిధిలో ఏర్పాటుచేసిన మీడియా మావేశంలో ఆయన ఈవో శ్యామలరావుతో కలసి మాట్లాడారు. స్వామివారి ఆలయ ఆవరణలో ఈనెల 15న సాయంత్రం 6.30 గంటలనుంచి రాత్రి 8.30వరకు స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు ఆకాంక్ష మేరకు శ్రీనివాస కల్యాణం అనంతరం స్వామివారి ఆశీస్సులతో అమరావతి పునర్నిర్మాణానికి ఏర్పాటుజరుగుతాయన్నారు. ఇందులో భాగంగా గురువారం అమరావతి రైతులు, రైతుసంఘాల నాయకులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం టీటీడీ ఈవో శ్యామలరావు మాట్లాడుతూ, శ్రీనివాస కల్యాణానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృతఏర్పాట్లు చేపట్టినట్టు తెలిపారు. ఏర్పాట్లగురించి వివరిస్తూ.. కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు తిరుమల నుండి అర్చక స్వాములు, వేద పండితులు రానున్నట్లు తెలిపారు.

హాల్‌టిక్కెట్‌తో పది విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం

గుంటూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఈనెల 17వ తేదీనుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పది విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించనున్నట్లు డీపీటీవో ఎం రవికాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు హాల్ టిక్కెట్టు బస్సు టిక్కెట్‌తో సమానమని పేర్కొన్నారు. పల్లెవెలుగు, అల్ట్రా డీలక్స్ బస్సుల్లో ఈ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. పరీక్షల సమయాల్లో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా సర్వీసులు పెంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

నేత్రపర్వం.. నృసింహుని కల్యాణం

- శ్రీవారికి పట్టు వస్త్రాలను సమర్పించిన మంత్రి లోకేశ్ దంపతులు
- నేడు మంగళగిరి తిరునాళ్లు

మంగళగిరి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహ స్వామివారి కల్యాణం సాక్షాత్తూ అపర వైకుంఠాన్ని తలపింపజేసింది. జై నారసింహా...జైజై నారసింహ అనే భక్తుల జేజేలు, మేళతాళాలు, వేదపండితులు, అర్చకస్వాములు, పారాయణీకుల వేదఘోష నడుమ శ్రీలక్ష్మీ నృసింహుని కల్యాణోత్సవం శుక్రవారం వేకువజామున అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీ క్రోధినామ సంవత్సర ఫాల్గుణ శుద్ధ చతుర్దశి ఘడియల్లో శ్రీ నృసింహుడు అమ్మవార్ల మెడలో మాంగల్యధారణ చేసే ఘట్టాన్ని అర్చకులు, వేదపండితులు కన్నుల పండువగా నిర్వహించారు. అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన నృసింహుని కల్యాణాన్ని తిలకించి భక్తకోటి పులకించింది. సర్వ పరిమళాలను వెదజల్లుతూ సకల పుష్పాలంకరణలు, రంగురంగుల విద్యుద్దీపాలతో వెలిగిపోతున్న కల్యాణ మండపంపై వేదపండితుల పౌరోహిత్యంలో సర్వమంగళ వాయిద్యాల నడుమ నృసింహుని కల్యాణం వైఖానస ఆగమ శాస్త్రానుసారం జరిగింది. శ్రీస్వామివార్ల కళ్యాణోత్సవానికి స్థానిక శాసనసభ్యుడు, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ తన సతీమణి బ్రాహ్మణితో కలిసి వచ్చి వ్యక్తిగతంగా పట్టువస్త్రాలు, తలంబ్రాలను శ్రీస్వామివార్లకు సమర్పించారు.

కల్యాణోత్సవంలో సంప్రదాయంగా గురువారం రాత్రి అందాల నృసింహుడు పెండ్లి కుమారుని శోభలో చంద్రప్రభ వాహనంపై గ్రామోత్సవానికి వెళ్లివస్తూ ఉత్సవ గ్రౌం డు సమీపంలో పుష్పక విమానంపై తనకు ఎదురొచ్చి న నూతన పెండ్లి కుమార్తెలైన శ్రీదేవీ, భూదేవీ అమ్మవార్లతో ఎదురుకోల ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ ఉత్సవం అనంతరం అర్ధరాత్రి కావొస్తుండగా వేర్వేరు రథాలపై బ్యాండు మేళాలు, కోలాట నృత్యాల నడుమ నృసింహస్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అర్చకస్వాములు కల్యాణ మండపం వద్దకు తీసుకువచ్చారు. ఆ తదుపరి అర్చకస్వాములు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేసి మండప సంప్రోక్షణ చేశారు. ఈ మండపశుద్ధి తరువాత అష్టదిక్పాలకులను ఆవాహన గావించారు.

వైఖానస స్తోత్రాల వేదపఠనం, మంగళవాయిద్యాలు, భక్తజనుల గోవింద నామస్మరణలతో మండప ప్రాంగణం మార్మోగుతుండగా.. కల్యాణ యాజ్ఞికుని హోదాలో దీవి తిరుమల సత్య ప్రసాద్ ఉత్సవ మూర్తులను పెళ్లిపీటలపై ఆశీనులను గా వించారు. వివాహ తంతు ఆరంభమయ్యేటప్పటికి గురువారం అర్ధరాత్రి దాటి శుక్రవారం వేకువ జాము 12 గంటలు అయింది. ఈ కల్యాణాన్ని తిలకించిన మహిళలందరికీ జన్మజన్మలకు సువాసినీ జన్మ కలగాలని కోరుతూ అర్చకస్వాములు మాంగల్య పూజను నిర్వహించారు. అనంతరం తెల్లవారుజాము మూడున్నర గంటల సమయంలో భక్తజనుల కరతాళ ధ్వనులు... వేదఘోష మధ్య లోకకల్యాణార్థం స్వామివారి తరపున అర్చకస్వాములు అమ్మవార్లకు మాంగల్యధారణ చేశారు. ఆ వెంటనే శ్రీస్వామి వారికి యజ్ఞోపవీత ధారణ గావించారు. తొలుత కల్యాణాన్ని పురస్కరించుకుని స్థానిక శాసన సభ్యులు, విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సతీసమేతంగా హాజరై శ్రీస్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. శ్రీస్వామివారి తరపున శేకూరు గ్రామ వాస్తవ్యులు వాసిరెడ్డి జయదత్తు, ప్రభునాథ్... అమ్మవార్ల తరపున మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం ప్రతినిధి అవ్వారు శరత్‌బాబు మధుపర్కాలు, మంగళద్రవ్యాలను సమర్పించారు. చివరిగా అక్షతారోపణను జరిపించారు. భక్తులు ఈ కల్యాణ అక్షితలను మిక్కిలి భక్తి ప్రపత్తులతో స్వీకరించి తరించారు. మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం ప్రతినిధులు గుత్తికొండ ధనుంజయరావు, తిరువీధుల కిరణ్, మునగపాటి వెంకటేశ్వరరావు, దామర్ల మోహన్ తదితరులు కల్యాణోత్సవానికి హాజరై అమ్మవారికి తమ సంఘం తరపున పట్టువస్త్రాలు, మంగళసూత్రాలను సమర్పించారు.


స్వామివారికి పట్టు వస్త్రాలను తీసుకువస్తున్న ఈవో కోటిరెడ్డి, ఆలయప్రధాన అర్చకులు, పద్మశాలీయ సంఘం ప్రతినిధులు

నేడు మంగళగిరి తిరునాళ్ల


తెలుగునాట సుప్రసిద్ధమైన మంగళగిరి తిరునాళ్ల శుక్రవారం జరుగనుంది. నృసింహుని దివ్యరథోత్సవాన్ని మంగళగిరి తిరునాళ్లగా వ్యవహరిస్తుంటారు. ఈ రథోత్సవం శుక్రవారం మధ్యాహ్నం మూడున్నర గంటలకు ప్రారంభం కానుంది. రథోత్సవానికి సుమారు లక్షన్నర మంది భక్తులు హాజరయ్యే అవకాశం వుందని అంచనా వేస్తున్నారు.



చంద్రప్రభ వాహనంపై పెండ్లికుమారునిగా నృసింహస్వామి, పుష్పక విమానంపై నూతన వధువులు శ్రీదేవీ, భూదేవీ అమ్మవార్లు

ప్రజాభిప్రాయానికి భిన్నంగా గ్రామాల విలీనం

- అసెంబ్లీలో ప్రత్తిపాటి



చిలకలూరిపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి):మున్సిపాలిటీల్లో గ్రామాల విలీనం, రాష్ట్రంలో టెక్స్ టైల్ రంగ దుస్థితిని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. మున్సిపాలిటీల్లో గ్రామాల విలీనానికి సంబంధించిన జీవోపై రాష్ట్రంలో పలుచోట్ల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైందని, గత ప్రభుత్వం అనాలోచితంగా, స్థానికుల అభిప్రాయాలకు, నిబంధనలకు విరుద్ధంగా విలీనప్రక్రియ చేపట్టిందని అన్నారు. చిలకలూరిపేట మున్సిపాలిటీలో కొన్ని గ్రామాలను నిబంధనలకు విరుద్ధంగా విలీనం చేశారని చెప్పారు. పసుమర్రు, మానుకొండవారిపాలెం, గణపవరం గ్రామస్తులు విలీనాన్ని ఏకపక్షంగా తిరస్కరించారని అన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో కాటన్ అనుబంధ పరిశ్రమలకు పవర్ సబ్సిడీలు ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. గుజరాత్, మధ్యప్రదేశ్, మధ్యప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, ఛత్తీస్గడ్ రాష్ట్రా లు పవర్ సబ్సిడీలు ఇస్తున్నాయని తెలిపారు. రెండు లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న పరిశ్రమను బతికించకపోతే ప్రభుత్వం నష్టపోతుందని అన్నారు. వెంటిలేటర్ పై ఉన్న టెక్స్ టైల్ రంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన చెప్పారు. బయోమైనింగ్ పేరుతో చెత్త సేకరణ టెండర్లు దక్కించుకొని పనులు చేయకుండా డబ్బులు డ్రాచేసుకుని ప్రభుత్వా న్ని మోసగించిన జ్ఞానేశ్వర ఇంజనీరింగ్ సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని ఆయన కోరారు. అమృత్ పథకం తొలిదశలో అసంపూర్తిగా నిలిచిపోయిన పనుల్ని అమృత్-2లో పూర్తిచేయాలని ప్రత్తిపాటి సూచించారు. వచ్చే ఏప్రిల్ నుంచి బిల్లుల చెల్లింపును నేరుగా మున్సిపాలిటీలే చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభపరిణామన్నారు. ఈ నిర్ణయం వల్ల అభివృద్ధిపనులు వేగంగా జరుగుతాయని అన్నారు.

ట్రిపుల్ ఎక్స్ సోప్ అధినేత మాణిక్యవేల్ కన్నుమూత

గుంటూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని వ్యాపార దిగ్గజాల్లో ఒకరైన ట్రిపుల్ ఎక్స్ సోప్ అధినేత అరుణాచలం మాణిక్యవేల్ (76) ఇక లేరు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోన్న ఆయన ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి గురువారం కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తమిళనాడు నుంచి గుంటూరు వచ్చి నల్లచెరువులో స్థిరపడ్డారు. చిన్నపాటి సబ్బుల తయారీతో అంచలంచలుగా తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారు. ట్రిపుల్ ఎక్స్ పేరుతో సబ్బులను తయారు చేసి తొలినాళ్ళలో కేవలం రూపాయితో సామాన్య ప్రజల్లోకి తన ఉత్పత్తులను తీసుకెళ్ళగలిగారు. ప్రస్తుతం ఆయన భారతీ కన్స్యూమర్స్ వర్క్స్ పేరుతో తన వ్యాపారాన్ని ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో విస్తరించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది కుటుంబాలకు జీవనోపాధి కల్పించారు.

పలువురు నేతల నివాళులు.. సంతాపం

మాణిక్యవేల్ మృతికి పలువురు నేతలు సంతాపం తెలియజేశారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, గళ్ళా మాధవి, ఎండీ నసీర్ అహ్మద్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

నేడు గుంటూరులో అంత్యక్రియలు

మాణిక్యవేల్ అంత్యక్రియలు శుక్రవారం సాయంత్రం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గుంటూరు అరండల్‌పేట 10/1వ లైనులోని స్వగృహం నుంచి అంతిమ యాత్ర ప్రారంభమై అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.


మాణిక్యవేల్ (ఫైల్ ఫోటో)

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ముమ్మరంగా తనిఖీలు

- ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు కార్పొరేషన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): గుంటూరు పల్నాడు జిల్లాలలో ఎక్సైజ్ శాఖ అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారని ఆ శాఖ గుంటూరు డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతి జిల్లా సంచికలో 'మామూళ్ల.. కిక్కు' అనే కథనం ప్రచురితం కావడంతో స్పందించిన ఎక్సైజ్ అధికారులు గుంటూరు, పల్నాడు జిల్లాలలో క్రాస్ వెరిఫికేషన్ నిర్వహించారని తెలిపారు. రెండు జిల్లాలలోని 16 స్టేషన్లలో మొత్తం 24 డ్యూటీ పెయిడ్ మద్యం కేసులు నమోదు చేసి, 24 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 42.12 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు. అదేవిధంగా ఓపెన్ ప్రదేశాలలో మద్యం తాగుతున్న వారిపై 28 కేసులు నమోదు చేసి 28 మందిని అరెస్టు చేశామన్నారు. ఈ నెల 10వ తేదీన ఒక్కరోజే రెండు జిల్లాలలో ఓపెన్ ప్రదేశాలలో మద్యం తాగుతున్న వారిపై 72 కేసులు నమోదు చేసి 72 మందిని అరెస్టు చేసినట్టు శ్రీనివాసులు పేర్కొన్నారు.

ఉచితం.. అనుచితం

(3వ పేజీ తరువాయి)

దక్కాయి. దీంతో ఇక్కడ మూడు నుంచి ఐదు ఎక్స్‌కవేటర్లు పెట్టి ఇసుకను నదిలోకి తీసుకెళ్లి లారీలకు నేరుగా తోడేస్తున్నారు. పరిమితికి మించి ఇసుకను లారీల్లో నింపుతున్నారు. ట్రక్కులో కాకుండా చివరకు డ్రైవర్ క్యాబిన్‌పైన కూడా కొండలా ఇసుకను నింపేస్తున్నారు. పరిమితికి మించిన ఇసుక లారీల నుంచి వంతెనలు, మలుపులు, స్పీడ్ బ్రేకర్ల వద్ద జారిపోయి గుట్టలుగా పడిపోతోంది. దీంతో గాజుల్లంక-తెనాలి, గాజుల్లంక-రేపల్లె, కొల్లిపర-తెనాలి, కొల్లిపర-గుంటూరు, పెదకొండూరు-మంగళగిరి, విజయవాడ రోడ్లు ఇసుక మయంగా మారాయి. తెనాలి వైకుంఠపురం మార్గంలో రైల్వే ట్రాక్ వంతెనకు దిగువగా గడ్డర్లను ఏర్పాటు చేశారు. ఓవర్ లోడుతో వస్తున్న లారీల్లోని ఇసుక వాటికి పట్టి కిందికి జారిపోతోంది. వంతెన వద్ద ఇసుక కారణంగా ద్విచక్ర వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయి. ఈ వద్దే గడచిన పది రోజుల్లో 28కిపైగా ప్రమాదాలు జరిగాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. రేపల్లె నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న ఓ కుటుంబం జారి పడి తీవ్రంగా గాయపడిన తండ్రి, చిన్నారి ప్రస్తుతం గుంటూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇదే తరహాలో ఇద్దరు సచివాలయ ఉద్యోగినులు జారిపడ్డారు. అదే సమయంలో వెనుకగా వస్తున్న కంటైనర్ వెంటనే బ్రేక్ వేయడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఇదే తరహాలో పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నా పరిమితికి మించి ఇసుకతో వస్తున్న లారీలపై నియంత్రణ లేకపోగా, కనీసం రోడ్డుపై పడిన ఇసుకను కూడా తొలగించడంలేదు. అటు ట్రాక్టర్లలోనూ ట్రక్కుకు మించి గోడుగా పోసుకొస్తున్న ఇసుక రోడ్లపైకి జారిపోతోంది.

కృష్ణమ్మను కుళ్లబొడుస్తున్నారు..

కూలీలతో ఇసుక లోడ్ చెయ్యాల్సిన రీచ్‌లలో కూలీలు ఎక్కడా కనిపించడంలేదు. ఉచిత ఇసుక విధానం వచ్చినప్పటి నుంచి అనుమతి పొందిన ఏ రీచ్‌లోనూ కూలీలు ఒకటి, రెండు రోజులు మినహా తర్వాత నేరుగా ఎక్స్‌కవేటర్లనే దింపేశారు. ప్రస్తుతం గాజుల్లంక, ఇతర రీచ్‌లలో ఎక్స్‌కవేటర్లే ఉంటున్నాయి. ఇటు ఉమ్మడి గుంటూరు జిల్లా, అటు ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో గాజుల్లంక దగ్గర, పక్కనే శ్రీకాకుళం దగ్గర ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. బుధవారం పగలు, రాత్రి తేడా లేకుండా గాజుల్లంక రీచ్‌లో నాలుగు ఎక్స్‌కవేటర్లు, శ్రీకాకుళం రీచ్‌లో ఐదు ఎక్స్‌కవేటర్లు విరామం లేకుండా ఇసుక తవ్విపోస్తున్నాయి. ఎక్స్‌కవేటర్‌తో దిబ్బలను తవ్వుతున్నారా అంటే అదీలేదు. నీరు ఉబికివచ్చేలా తవ్వేస్తున్నారు. రాత్రి వేళల్లో నీటితో నిండిన ఇసుకను వాహనాలకు నింపేస్తున్నారు. దీంతో రోడ్లన్నీ నీటితో తడిచి బురదగా మారుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

పట్టాలెక్కనున్న.. వైకుంఠపురం బ్యారేజి

(3వ పేజీ తరువాయి)

నదిపై మూడు కిలోమీటర్ల నిడివిలో నిర్మాణం జరగనున్నది. 2019 జనవరి 12న శంకుస్థాపన జరిగిన ఈ బ్రిడ్జి నిర్మాణం జరిగి ఉంటే అటు హైదరాబాద్, జగదల్‌పూర్ హైవేలను, ఇటు ఎన్-10 రోడ్డు ద్వారా అనంతపూర్ ఎక్స్‌ప్రెస్ హైవేను నేరుగా రాజధాని అమరావతితో కనెక్ట్ చేసి ఉండేది. కేవలం రాజధాని అమరావతి కోణంలోనే కాకుండా ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలతో పాటు రాయలసీమ జిల్లాల వారికి కూడా ఈ ప్రాజెక్టుతో పెద్ద మేలు జరిగి ఉండేది. ఈ బ్రిడ్జి కమ్ బ్యారేజి నిర్మాణం వలన మున్నేరు, వైరా వంటి ఉపనదులతోపాటు మరికొన్ని వాగుల నుంచి వచ్చే వరద జలాలను ఈ జలాశయంలో నిల్వ చేసే అవకాశం కలుగుతుంది. రమారమి 10 టీఎంసీలకు పైగా నిల్వ చేయవచ్చునని జలవనరులశాఖ అంచనా వేసింది. ఫలితంగా కృష్ణానది వెంబడి మళ్లీ త్వరితగతిన జరీభూములు ఏర్పడే అవకాశాలు మెరుగవుతాయి. అలాగే జలరవాణాకు మంచి అవకాశం ఏర్పడుతోంది. పర్యాటకంగా కూడా ఈ ప్రాంతం బాగా అభివృద్ధి చెందుతుంది. ఈ బ్యారేజి నుంచి రాజధాని అమరావతికి ఎత్తిపోతల సాయంతో రోజుకు 350 క్యూసెక్కుల నీటిని తరలించాలని కూడా నిర్ణయించారు.

16 నుంచి 26వ తేదీ వరకు పలు రైళ్ల రద్దు

గుంటూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఆపరేషనల్ సమస్యల కారణంగా 10 రోజుల పాటు పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబర్ 67769/67770 విజయవాడ - గుంటూరు - విజయవాడ రైళ్లను ఈ నెల 16వ తేదీ నుంచి 25వ తేదీ వరకు రద్దు చేశామన్నారు. అలానే నంబర్ 67775/67777 కాచిగూడ - మిర్యాలగూడ - నడికుడి రైళ్లను కూడా ఈ నెల 16 నుంచి 25వ తేదీ వరకు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. నంబర్ 67778/67776 నడికుడి - మిర్యాలగూడ - కాచిగూడ రైళ్లను ఈ నెల 17వ తేదీ నుంచి 26వ తేదీ వరకు రద్దు చేశామన్నారు.

చర్లపల్లిలో మరికొన్ని రైళ్లకు నిలుపుదల సౌకర్యం

ఈ నెల 14వ తేదీ నుంచి నంబర్ 12705/12706 సికింద్రాబాద్ - గుంటూరు - సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, నంబర్ 17645/17646 సికింద్రాబాద్-రేపల్లె-సికింద్రాబాద్ సిరిపురంలో, నం.17646 రేపల్లె-సికింద్రాబాద్ రామన్నపేటలో, నంబర్ 20701/20702 సికింద్రాబాద్-తిరుపతి-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మిర్యాలగూడలో నిలుపుదల సౌకర్యాన్ని కొనసాగించనున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు.

ముగిసిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు

- విద్యార్థుల హర్షాతిరేకం.. హాస్టల్ విద్యార్థుల ఇంటిబాట

గుంటూరు(విద్య),మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఇంటర్ పరీక్షలు ఈనెల నుంచి ప్రారంభం అయిన విషయం తెలిసిందే పరీక్షలు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు జిల్లా నుంచి 32వేల మందికి పైగా విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎక్కడా కూడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉంటే పరీక్షలు ముగియడంతో విద్యార్థిని విద్యార్థులు ఆనందోత్సవాల్లో మునిగిపోయారు. కేంద్రాల నుంచి కేకలు వేసుకుంటూ బయటకు వచ్చి తమవద్ద ఉన్న నోట్‌బుక్స్‌ను చింపి గాల్లో వేసి ఆనందం వ్యక్తం చేశారు. అనేక కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఇదిలా ఉంటే హాస్టల్స్‌లో ఉండే విద్యార్థిని విద్యార్థులు గురువారం సాయంత్రమే ఇంటి బాట పట్టారు. కొన్ని హాస్టల్స్‌కు తల్లిదండ్రులు వచ్చి విద్యార్థుల్ని ఇళ్ళకు తీసుకెళ్ళారు.


పేపర్లు ఎగురవేస్తూ ఆనందంతో విద్యార్థులు..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాజుపాలెం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపై మండల పరిధిలోని నెమలిపురి గ్రామ శివారు శ్రీనివాసనగర్ వద్ద జరిగింది. సేకరించిన వివరాలిలా ఉన్నాయి... పిడుగురాళ్ల పట్టణానికి చెందిన వడ్ల శ్రీను(21) నకరికల్లులో తన బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండటంతో ఈ నెల 12వ తేదీన అక్కడికి వెళ్లాడు. శుభకార్యం చూసుకుని తిరిగి తన స్వగ్రామమైన పిడుగురాళ్లకు బయల్దేరాడు. మార్గమధ్యంలోని నెమలిపురి గ్రామ శివారు శ్రీనివాసనగర్ సమిపంలోకి వచ్చేసరికి ఇంకొల్లు నుండి హైదరాబాదు వస్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి అతివేగంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో వడ్ల శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై వేణుగోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

1,41,244 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,28,725 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,41,244 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 56,214 టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			షార్క్-1	11000	12400
334	9500	13800	బ్యాడిగి 355	10000	14000
నంబరు 5	10000	14000	సింజెంటా బ్యాడిగి 5531	10500	12200
273	10000	13000	దేవనూరు డీలక్స్	11500	14000
341	10500	14500	ఆర్మూరు	10000	11000
4884	--	--	నాన్ ఏసీ తాలుకాయలు	5000	7500
సూపర్10	--	--			
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ					
తేజ	10500	14000			

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	91, 99, 110
చికెన్ విత్ స్కిన్	176.00
చికెన్ స్కిన్ లెస్	186.00

వెబ్‌సైట్‌లో డీఎస్సీ శిక్షణకు ఎంపికైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల జాబితా

గుంటూరు(విద్య), మార్చి 13(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమశాఖ సంయుక్తంగా ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ శిక్షణ ఇవ్వనుందని, ఇందుకు ఎంపికైన అభ్యర్థుల జాబితా వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డిప్యూటీ డైరెక్టర్ మధుసూదనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు వెబ్‌సైట్‌లో వివరాలు చూసుకోవాలని, ఈనెల 15లోగా తమ శిక్షణ కోసం కోచింగ్ సెంటర్‌ను ఎంపిక చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం జ్ఞానభూమి పోర్టల్, https://mdfc.apcfss.in అనే వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

మద్దతు ధరకు అపరాల కొనుగోళ్లు: జేసీ

గుంటూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ తరఫున జిల్లాలో రబీ 2024-25 సీజన్‌కు సంబంధించి రైతులు పండించిన మినుములు, శనగలు, పెసలను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఏ భార్గవతేజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మినుముకు మద్దతు ధరని రూ.7,400, శనగలకు రూ.5650, పెసలకు రూ.8682గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ-క్రాప్‌లో నమోదైన రైతుల నుంచి మాత్రమే ఈ మూడు రకాల అపరాలను కొనుగోలు చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో రైతులు తమకు సమీపంలోని రైతుసేవా కేంద్రాలకు వెళ్లి వారి పేర్లను సీఎం యాప్‌లో ఈ నెల 15వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పీఎఫ్ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఏజే హుస్సేన్ విజ్ఞప్తి

గుంటూరు(విద్య), మార్చి 13(ఆంధ్రజ్యోతి): పీఎఫ్ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఏజే హుస్సేన్ విజ్ఞప్తి చేశారు. గురువారం కృష్ణనగర్‌లోని పీఎఫ్ కార్యాలయంలో పీఎఫ్ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి పీఎఫ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆల్ ఇండియా కార్యదర్శి కృపాకర్ హాజరయ్యారు. కారుణ్యనియామకాలు చేపట్టాలని, పెన్షన్ మార్పు సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఉత్పాదక అనుసంధాన బోనస్ రాని విశ్రాంత ఉద్యోగుల డిమాండ్స్ పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా కృపాకర్‌ను సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు.

నరేగా నిధులను సర్పంచ్‌ల ద్వారానే చెల్లించాలి

● కేంద్ర పీఆర్ సంయుక్త కార్యదర్శికి పంచాయతీ పరిషత్ విజ్ఞప్తి



నరేగా నిధుల చెల్లింపు వ్యవహారంపై కేంద్ర పీఆర్ సంయుక్త కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ జాస్తి వీరాంజనేయులు తదితరులు

గుంటూరు సిటీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నరేగా నిధులను గ్రామ పంచాయతీ సర్పంచుల ద్వారా చెల్లించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ అఖిల భారత పంచాయతీ పరిషత్ నేతలు కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శి అలోక్ ప్రేమ్‌నగర్‌కు గురువారం ఢిల్లీలో వినతిపత్రం అందజేశారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నరేగా నిధులు చెల్లింపు బాధ్యతను ఎంపీడీఓలకు అప్పగించిందని డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, కొత్తపు మునిరెడ్డి కేంద్ర అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శి నిధులు పంచాయతీ ద్వారానే చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు ఇస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

మాణిక్యవేల్‌కు బ్రాహ్మణ చైతన్య వేదిక సంతాపం

గుంటూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఎక్స్ సోప్స్ అధినేత అరుణాచలం మాణిక్యవేల్ మృతికి బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షుడు శిరిపురపు శ్రీధర్ శర్మ గురువారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. తమిళనాడు నుంచి గుంటూరుకు వచ్చి ట్రిపుల్ ఎక్స్ సోప్స్ అనే వ్యాపారసంస్థని ప్రారంభించి ఆయన అంచెలంచెలుగా ఎదిగి ఎంతోమందికి ఉపాధి అవకాశాలు కల్పించారని కొనియాడారు. మాణిక్యవేల్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి శ్రీలక్ష్మీతిరుపతమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం

గుంటూరు(తూర్పు), మార్చి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక కొరిటెపాడు, ఆంజనేయపేటలో కొలువైన శ్రీలక్ష్మీ తిరుపతమ్మ-గోపయ్యస్వామి తిరునాళ్ల మహోత్సవం శుక్రవారం నుంచి 18వ తేదీ వరకు జరుగుతుందని ఆలయ నిర్వాహకులు కన్నసాని విజయకుమార్(రాజా) ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 14న అమ్మవారికి కుంకుమార్చన, 15న స్వామివార్లకు అభిషేకం, ఊరేగింపు, 16న పసుపు, కుంకుమ గాజులు పంచుట, 17న చండీ హోమం, 18న అన్నదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో గరుడ ధ్వజపట ఆరోహణం

గుంటూరు(తూర్పు), మార్చి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ అగ్రహారం శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో 29వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామివారికి అభిషేకం, అలంకార పూజ, సహస్రనామార్చన, విశ్వక్సేన ఆరాధన జరిగాయి. అనంతరం గరుడ ధ్వజ పట ఆరోహణం, బలిహరణం తదితర కార్యక్రమాలను వేద పండితులు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ తదితరులు పర్యవేక్షించారు.



ధ్వజపట ఆరోహణం చేస్తున్న వేదపండితులు

అంతర్గత రహదారులకు ప్యాచ్‌వర్క్‌లు పూర్తిచేయాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రధాన, అంతర్గత రోడ్లకు ప్యాచ్‌వర్క్‌లను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని, ఏఈల వారీగా ప్యాచ్‌వర్క్‌లపై బాధ్యత తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం కమిషనర్ ఏటీ అగ్రహారం, శాంతినగర్, బాలాజీనగర్ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను, జీఎంసీ వెహికిల్ షెడ్‌లో పారిశుధ్య పనులకు అవసరమైన సామాగ్రిని పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీచేశారు. నూతన రోడ్ల ఏర్పాటుకు ముందే డ్రెయిన్ల నిర్మాణం చేపట్టాలన్నారు. ప్యాచ్‌వర్క్‌లలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా ఎమినిటి కార్యదర్శులు, ఏఈలు పర్యవేక్షణ చేయాలన్నారు. అనంతరం బాలాజీనగర్‌లో పలు అభివృద్ధి పనులను పరిశీలించి, శివారు ప్రాంతాల్లో డ్రెయిన్ల ఏర్పాటుపై ఇంజనీరింగ్ అధికారులు, పారిశుధ్య పనులపై ప్రజారోగ్య అధికారులు దృష్టి సారించాలన్నారు. ఏటీ అగ్రహారంలో తాగునీటిలో క్లోరిన్‌శాతాన్ని తనిఖీ చేసి, ప్రతిరోజు ఎమినిటి కార్యదర్శులు సరఫరా వేళలో శాంపిల్స్ తీయాలని ఆదేశించారు. పర్యటనలో ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈ మధుసూదన్, ఏఈలు, టీపీఎస్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



రోడ్డుపై ఉన్న మురుగును పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

అన్న క్యాంటీన్లలో పరిశుభ్రత పాటించాలి

అన్న క్యాంటీన్లలో గ్రీనరీ, పరిశుభ్రత ఉండేలా అక్షయ పాత్ర, ఇంజనీరింగ్ సిబ్బంది సమన్వయంతో చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. పల్నాడు బస్టాండ్ దగ్గరలోని అన్న క్యాంటీన్‌ని పరిశీలించి, ప్రజలతో మాట్లాడి, సిబ్బందికి తగు ఆదేశాలు జారీచేశారు. క్యాంటీన్లకు వస్తున్న పేదవారికి ఎవ్వరికీ ఆహారం అందలేదనే ఫిర్యాదు రాకూడదన్నారు. ప్రజలు క్యాంటీన్‌లో అందే ఆహారంపై తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేయవచ్చన్నారు.

వ్యర్థాల తొలగింపునకు ప్రత్యేక కార్యాచరణ

జాతీయరహదారి వెంబడి వ్యర్థాలను తొలగించడాని కి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశామని కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం కమిషనర్ ఆదేశాల మేరకు బయాలజిస్ట్ రామారావు నేతృత్వంలో కాకాని జంక్షన్ నుండి బుడంపాడు జంక్షన్ వరకు కార్మికులు జాతీయరహదారి వెంబడి ఉన్న వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జాతీయ రహదారి వెంట రాత్రి వేళల్లో వ్యర్థాలను వేసేవారిని గుర్తించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజలు కూడా వ్యర్థాలను రహదారి వెంబడి వేయకుండా సహకరించాలని కోరారు.

కవయిత్రి మొల్లకు కలెక్టర్ ఘన నివాళి



కవయిత్రి మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, డీఆర్వో

గుంటూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): వాల్మీకి రచించిన రామాయణాన్ని సంస్కృతం నుంచి తెలుగు భాషలోకి అనువదించిన తొలి తెలుగు మహిళా కవయిత్రి ఆతుకూరి మొల్ల అని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కవయిత్రి మొల్ల జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ మొల్ల సాహితీ రంగంలో అందించిన సేవలను తెలుగు ప్రజలు ఎల్లవేళలా గుర్తుంచుకొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో షేక్ ఖాజావలి, కుమ్మర, శాలివాహన సంఘాల నాయకులు యు.వెంకటేశ్వర్లు, కే నాగేశ్వరి, పిడతల నాగమల్లేశ్వరరావు, చిరతనగండ్ల వాసు, బీసీ సంక్షేమ అధికారి భవాని, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మిర్చియార్డులో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకొంటున్న రైతులు, హమాలీలు

రైతులు, హమాలీలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

● మిర్చియార్డు సెక్రెటరీ చంద్రిక

గుంటూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మిర్చి రైతులు, హమాలీలు తమ ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయరాదని మిర్చియార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక అన్నారు. గురువారం యార్డు పరిపాలన భవనంలో రైతులు, హమాలీల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా న్యూరాలజీ, కార్డియాలజీ, పల్మనాలజీ, డయాబెటాలజీకి సంబంధించిన వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రైతుల శ్రేయస్సే గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ లక్ష్యమన్నారు. ఇకపై తరచుగా వైద్యశిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో యార్డులో వివిధ గ్రేడ్‌ల సెక్రెటరీలు సుబ్రహ్మణ్యం, ఆంజనేయ సింగ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మినహాయించిన మొత్తం జడ్పీ పీఎఫ్‌లో నమోదుచేయాలి

గుంటూరు(విద్య), మార్చి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న ఎంఈవో-2 అధికారుల జీతాల నుంచి మినహాయించిన మొత్తాలు జడ్పీ పీఎఫ్ ఖాతాల్లో జమకావడం లేదని ఎంఈవో అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు జడ్పీ సీఈవో జ్యోతిబసుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సమస్య 2023 జూలై నుంచి ఉందని, వెంటనే పరిష్కరించాలని సంఘం నాయకులు కోరారు. కార్యక్రమంలో ఎంఈవో అసోసియేషన్ నాయకులు శంకరరాజు, నాగేంద్రమ్మ, నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

● కిమ్స్ శిఖర వైద్యనిపుణుల సూచన

గుంటూరు మెడికల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కిడ్నీ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని కిమ్స్ శిఖర హాస్పిటల్స్‌కు చెందిన నెఫ్రాలజిస్ట్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ వి.శరత్‌చంద్ర, యూరాలజిస్ట్ డాక్టర్ పెంట్యాల శ్రీకాంత్ తెలిపారు. వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా మంగళదాస్‌నగర్‌లోని కిమ్స్ శిఖర హాస్పిటల్స్‌లో గురువారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరంలో వారు ప్రసంగించారు. నలభై ఏళ్ల దాటినవారు తరచూ కిడ్నీ సంబంధిత పరీక్షలు చేయించుకోవడం వల్ల దీర్ఘకాలిక కిడ్నీ జబ్బుల బారినపడకుండా కాపాడుకోవచ్చన్నారు.అనంతరం జరిగిన వైద్యశిబిరంలో రోగులకు ఉచితంగా జీఆర్‌బీఎస్ పరీక్ష, సీరం క్రియాటిన్, కంప్లీట్ యూరిన్ పరీక్షలు నిర్వహించారు. యూరాలజీ, నెఫ్రాలజీ కన్సల్టింగ్ సేవలను కూడా ఉచితంగా అందించారు. శిబిరంలో వందమందికి వైద్యపరీక్షలు చేసినట్లు కిమ్స్‌శిఖర యాజమాన్యం తెలిపింది.

20న కిమ్స్‌లో ఉద్యోగ అవకాశాలపై సదస్సు

గుంటూరు మెడికల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యరంగంలో ఉద్యోగ అవకాశాలపై ఈ నెల 20న మంగళదాస్‌నగర్‌లోని కిమ్స్ శిఖర హాస్పిటల్స్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా కిమ్స్ గ్రూప్ చైర్మన్, ఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు పాల్గొని ప్రసంగిస్తారని వివరించారు. ఇంటర్, డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులకు ఆరోగ్య రంగంలో శిక్షణ, ఉపాధి అవకాశాలపై ఈ సదస్సులో వివరిస్తారన్నారు. ఏడాది శిక్షణలో ఒకనెల ప్రాథమిక శిక్షణ, 11 నెలలు ప్రాక్టికల్ శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో స్టైఫండ్ అందిస్తామన్నారు. శిక్షణ అనంతరం కోర్సు సర్టిఫికెట్ అందజేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని నాగేశ్వరరావు తెలిపారు. మార్చి 20వ తేదీ ఉదయం పది గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సులో పాల్గొనదలచిన వారు సెల్ నెం.81210 27256, 74166 00691లో సంప్రదించాలని ఆయన కోరారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

గోశాలకు విరాళం అందజేత

గుంటూరు(తూర్పు), మార్చి 13(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా, జగ్గయ్యపేటలోని వేదాద్రి పుణ్యక్షేత్రం, శ్రీయోగానంద శ్రీలక్ష్మీ నరసింహస్వామి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలకు వాసవీ క్లబ్ గుంటూరు, మహిళ, యువ క్లబ్ సంయుక్తంగా రూ.2,18,300 విరాళాన్ని ప్రకటించారు. ఈ విరాళం చెక్కును గురువారం జగ్గయ్యపేట, ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య, వాసవి క్లబ్ అధ్యక్షుడు రాయవరపు అశోక్‌కుమార్ చేతులమీదుగా ట్రస్ట్ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మున్నలూరి గౌరీశంకర్, కూనిశెట్టి చంద్రశేఖర్, పారేపల్లి చెన్నకేశవ బాబ్జి, పబ్బిశెట్టి చిరంజీవి, నూనె కిషోర్, దివ్వెల కోటేశ్వరరావు, కసుకుర్తి హనుమంతురావు, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, కొనగళ్ళ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గోశాలకు విరాళం అందజేస్తున్న జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య, వాసవీ క్లబ్ సభ్యులు

కానిస్టేబుల్‌పై దాడి చేసిన నలుగురు వైసీపీ నేతలు అరెస్టు

గుంటూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ బుధవారం నిర్వహించిన యువతపోరు కార్యక్రమంలో భాగంగా ర్యాలీలో విధులు నిర్వహిస్తున్న వెస్ట్ ట్రాఫిక్ కానిస్టేబుల్ సుభానిపై దాడి చేసి కొట్టిన కేసులో నలుగురు వైసీపీ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు గురువారం పెదపలకలూరుకు చెందిన వైసీపీ నేత నూనె ఉమామహేశ్వరరెడ్డి, స్థంబాలగరువుకు చెందిన చల్లా శివకోటేశ్వరరావు అలియాస్ శివకోటి, పెదపలకలూరుకు చెందిన భవనం శివనాగిరెడ్డి, ఫిరంగిపురం మండలం నుదురుపాడుకు చెందిన కొల్లి వెంకట రెడ్డి తదితరులను నగరంపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని శుక్రవారం కోర్టులో హాజరుపరచనున్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

గుంటూరు(తూర్పు), మార్చి 13(ఆంధ్రజ్యోతి): డీఎస్సార్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఉర్దూ పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు దామచర్ల శ్రీనివాస్, సభ్యులు జొన్నలగడ్డ శివ, రాజా, హెచ్‌ఎం మాధురి పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

గుంటూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అద్దెకు ఉంటున్న వ్యక్తి బిల్డింగ్ అద్దె చెల్లించకుండా, ఖాళీ చేయకుండా యజమానిపై దాడి చేసి చంపుతానని బెదిరించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రామనామ క్షేత్రం 1వ లైనుకు చెందిన దొడ్డి అనిల్ కుమార్‌కు బ్రాడీపేట 2/1వ లైనులో మూడు అంతస్తుల భవనం ఉంది. సదరు భవనాన్ని బ్రాడీపేటలో ఓ కోచింగ్ సెంటర్ నిర్వహించే కారంపూడి గంగా కిశోర్ అనే వ్యక్తి అద్దెకి ఇచ్చాడు. గత కొన్ని సంవత్సరాలుగా సదరు గంగా కిశోర్ బిల్డింగ్‌లో వివిఎస్ టెక్నాలజీస్ పేరుతో కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. కొన్ని సంవత్సరాలుగా అద్దె చెల్లించకుండా, బిల్డింగ్ ఖాళీ చేయకుండా అద్దె అడుగుతున్నందుకు ఫిర్యాదిని కొట్టి చంపుతానని బెదిరించినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నారు.

వైభవంగా స్వామివారి కల్యాణం

గుంటూరు(తూర్పు), మార్చి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట, శ్రీ అష్టలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న 30వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం గోపూజ, గణపతి పూజ, శ్రీచక్రమేరుకు విశేష అభిషేకాలు అర్చనలు జరిగాయి. అనంతరం శ్రీవిద్యాలక్ష్మీ, నారాయణుల కల్యాణం కనులపండువగా జరిగింది. మహాహారతి, మంత్రపుష్పం, కల్యాణంలో పాల్గొన్న దంపతులకు, భక్తులకు తీర్థప్రసాద వితరణ, అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాల్ని ఆలయ ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాదు శర్మ, ధర్మకర్త మర్రిపాటి పార్థసారధి పర్యవేక్షించారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

చీటింగ్ కేసులో ఫైనాన్స్ సంస్థ ఉద్యోగులను విచారిస్తున్న పోలీసులు

గుంటూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తాకట్టు పెట్టుకున్న బంగారాన్ని సదరు మహిళకు ఇవ్వకుండా మోసం చేసిన కేసులో ఫైనాన్స్ సంస్థ ఉద్యోగులను అరండల్‌పేట పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.....ముత్యాలరెడ్డి నగర్‌కి చెందిన మేకల శిల్పా అనే మహిళ లక్ష్మీపురం మెయిన్ రోడ్డులో బంగారు ఆభరణాల షాపు నడుపుతున్నది. తన వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోనే నిమిత్తం తన వద్ద ఉన్న బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి రుణం తీసుకోవడానికి గానూ గతంలో అరండల్‌పేట 10వ లైనులోని ఇండిల్ గోల్డ్ మనీ ప్రైవేట్ లిమిటెడ్ అనే ఫైనాన్స్ సంస్థను సంప్రదించింది. సదరు సంస్థ మేనేజర్ అయిన రజిని అనే మహిళ మొత్తం బంగారం ఒకే పేరు మీద పెడితే ఎక్కువ లోన్ రాదని మాయమాటలు చెప్పి శిల్పకి చెందిన 5 వేల 845 గ్రాముల బంగారు ఆభరణాలు తీసుకొని కొంత బంగారం మాత్రమే శిల్ప పేరు మీద, మిగిలిన బంగారం వేరే వారి పేరు మీద పెట్టి రూ. 2 కోట్ల 30 లక్షల లోన్ మంజూరు చేసింది. శిల్ప రుణం తిరిగి చెల్లిస్తాను తన బంగారు ఆభరణాలు తిరిగి ఇవ్వమని కోరింది. సదరు బంగారం మీ పేరు మీద లేదు అని, అమ్మేశాం అని చెబుతున్నారని ఫిర్యాదు చేసింది. సదరు బ్యాంకు మేనేజర్ ఇతరులతో కలిసి కుమ్మక్కు అయ్యి వేరే ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలలో తాకట్టు పెట్టి అధిక రుణం తీసుకుని తనను మోసం చేసినట్లు బాధితురాలు శిల్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆటల పోటీల్లో గెలుపొందిన మహిళా ఉద్యోగులకు బహుమతులు అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, సీఈఓ జ్యోతి బసు, డిప్యూటీ సీఈఓ కృష్ణ

మహిళకు గౌరవం దక్కే చోట దేవతలుంటారు

● జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు సిటీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మహిళలు ఎక్కడైతే గౌరవించబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇటీవల జడ్పీ కార్యాలయ ఆవరణలో మహిళా ఉద్యోగులకు నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలకు గురువారం జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. సమావేశానికి పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం నాయకుడు డాక్టర్ కూచిపూడి మోహన్‌రావు అధ్యక్షత వహించారు. చైర్‌పర్సన్ ప్రసంగిస్తూ సమాజంలో మహిళల పాత్ర చాలా కీలకమైందన్నారు. సీఈఓ జ్యోతిబసు మాట్లాడుతూ మహిళలకు పార్లమెంటు, శాసనసభలలో ఇంకా సీట్లు పెంచాలని కోరారు. పంచాయతీరాజ్ జిల్లా కోఆర్డినేటర్ పద్మరాణి మాట్లాడుతూ ఆత్మస్థైర్యంతో మహిళలు ముందుకుసాగాలని సూచించారు. ఇంకా డిప్యూటీ సీఈఓ కృష్ణ, అకౌంట్స్ ఆఫీసర్ శామ్యూల్‌పాల్ మాట్లాడారు. ఈ సందర్భంగా విజేతలైన మహిళలకు అతిథులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉషాదేవి, పలువురు ఏవోలు పాల్గొన్నారు.

పోసానిపై కేసు నమోదు చేయాలి: కనపర్తి

గుంటూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): బెయిల్ ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటానని మేజిస్ట్రేట్‌ను బ్లాక్ మెయిల్ చేసిన సినీనటుడు పోసాని కృష్ణ మురళిపై కేసు నమోదు చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ అండతో, సజ్జల స్క్రిప్టుతో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయిన పోసాని, చేసిన తప్పుకు శిక్ష అనుభవించక తప్పదన్నారు. నాడు నవ్వుతూ చేసిన పాపాలు, నేడు ఏడుస్తూ అనుభవించాల్సిందేనన్నారు. డబ్బు, పదవుల కోసం అత్యాశకుపోయి హద్దులుమీరి ప్రవర్తించిన ప్రతి వైసీపీ నాయకుడికి పోసానికి పట్టినగతే పడుతుందని హెచ్చరించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి అండ చూసుకొని గతంలో చంద్రబాబుపై తీవ్రంగా నోరు పారేసుకున్న మైనింగ్ డాన్ గాలి జనార్ధనరెడ్డికి కూడా జైలుకు వెళ్లొచ్చాకే తత్వం బోధపడి ఆయనకు బహిరంగ క్షమాపణలు చెప్పాడని గుర్తుచేశారు.

ఇన్ఫోసిస్‌లో ఉద్యోగాలకు ఆర్వీఆర్ జేసీ విద్యార్థుల ఎంపిక

గుంటూరు(విద్య), మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కార్పొరేట్ సంస్థ ఇన్ఫోసిస్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఆర్వీఆర్‌అండ్‌జేసీ విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బిజినెస్ సిస్టమ్ విభాగం నుంచి ఆరుగురు, డేటాసైన్స్ నుంచి ఒకరు, సీఎస్ఈ విభాగం నుంచి ఆరుగురు, సీఎస్ఎం నుంచి నలుగురు, ఈసీఈ నుంచి 10మంది, ఈఈఈ నుంచి ఒకరు, ఐటీ నుంచి ఐదుగురు, ఐఓటీ నుంచి ఇద్దరు, పీజీలో ఎంసీఏ నుంచి ఒక విద్యార్థి మొత్తం 36మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ సీహెచ్ శ్రీనివాసరావు, డాక్టర్ కె.సురేష్‌బాబు అభినందించారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆళ్ల హరి తదితరులు

చరిత్రలో నిలిచిపోయేలా జయకేతనం సభ

గుంటూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని చిత్రాడలో శుక్రవారం జరిగే జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభ జయకేతనం చరిత్రలో నిలిచిపోయేలా జరగనుందని జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ల హరి తెలిపారు. గురువారం శ్రీనివాసరావుతోటలో జరిగిన కార్యక్రమంలో ఆవిర్భావసభ 'జయకేతనం' పోస్టర్లను ఆయన జనసైనికులతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మెహబూబ్ బాషా, కొత్తకోట ప్రసాద్, కోలా అంజి, వడ్డె సుబ్బారావు, నండూరి స్వామి, బాలాజీ, తాడికొండ శ్రీనివాసరావు, కాసులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గుంటూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మిర్చి యార్డులో గుమస్తాగా పని చేసే దొడ్డా రత్నాకర్ (64) మృతి చెందాడు. వివరాలు ఇలాఉన్నాయి... మిర్చి యార్డులో గుమస్తాగా పని చేసే కొత్తకాలనీకి చెందిన రత్నాకర్ స్కూటీ వాహనంపై హౌసింగ్ బోర్డు కాలనీ వైపు వస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ద్విచక్ర వాహనంపైకి దూసుకుపోయింది. ఈ ఘటనలో రత్నాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న నల్లపాడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని రుద్ర చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని ఆత్మహత్య

స్థానిక లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్నబజారుకు చెందిన తవరగిరి నాగార్జునరావు (45) అనే వ్యక్తి అనారోగ్య కారణాలతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాగార్జునరావు ఐదేళ్లుగా షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ వ్యాధి కారణంగా అతని కుడికాలు మోకాళ్ళ కింద భాగం తీసివేశారు. అప్పటినుంచి ఆయన మానసికంగా బాధపడుతున్నాడు. దీంతో గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరులేని సమయంలో ఇంటిలో ఫ్యాన్‌కి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య హిమబిందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు స్టాంప్ వెండర్ల సస్పెన్షన్

ముగ్గురు స్టాంప్ వెండర్లను ఆరు నెలల పాటు సస్పెండ్ చేస్తూ జిల్లా రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. అధిక ధరలకు స్టాంప్‌లు విక్రయించడమే కారణం. డీవీఎస్ఆర్ మూర్తి అనే వ్యక్తి గత డిసెంబరులో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నాన్ జ్యుడీషియరీ స్టాంప్‌లు కొనుగోలు చేశాడు. ముగ్గురి వద్ద స్టాంప్‌లు కొనుగోలు చేయగా వారు స్టాంప్ రుసుం కంటే కూడా ఎక్కువ వసూలు చేశారు. దీంతో మూర్తి రిజిస్ట్రేషన్ డీఆర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ తరువాత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా దీనిపై విచారణ జరిపించారు. విచారణలో స్టాంప్ వెండర్లయిన బత్తుల గోవిందయ్య, ఆర్ ప్రేమయ్య, చెరుకూరి రాణి తదితరులు అధిక మొత్తం వసూలు చేసినట్లు నిర్ధారణ అయింది. దీనిపై చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రేషన్స్ డిఐజీ ఆదేశాల మేరకు డిఆర్ వారు ముగ్గురుని ఆరు నెలల పాటు సస్పెండ్ చేశారు.

సబ్సిడీ రుణాలకు 22లోపు దరఖాస్తు చేసుకోవాలి

● ఎంపీడీవో ఏ శ్రీనివాసరావు

దుగ్గిరాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులైన బీసీ, ఓబీసీకి చెందిన లబ్ధిదారులు బ్యాంకు లింక్ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని ఎంపీడీవో ఏ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని 18 గ్రామాలకు చెందిన 21నుంచి 60 ఏళ్లలోపు వయస్సుగల అర్హులైన లబ్ధిదారు లు ఓబీఎంఎంఎస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఈనెల 22వతేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కిడ్నీ సమస్యలపై అవగాహనా ర్యాలీ

మంగళగిరి సిటీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కిడ్నీ డే సందర్భంగా మంగళగిరి ఎయిమ్స్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం పట్టణంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఎయిమ్స్ డైరెక్టర్ అహంతెమ్ శాంతా సింగ్ ర్యాలీని ప్రారంభించి ప్రసంగించారు. ప్రపంచ జనాభాలో దాదాపు సగం మంది దీర్ఘకాల కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నారని చెప్పారు. జంక్ ఫుడ్ ఎక్కువగా తినడం, మద్యపానం, ధూమపానం వంటి చెడు వ్యసనాలు వున్న వారికి కిడ్నీ సమస్యలు అధికంగా వస్తున్నాయని తెలిపారు. బీపీ, షుగర్ అదుపులో లేకపోవడం వల్ల కిడ్నీ సంబంధిత సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. కిడ్నీ సంబంధిత వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, బీపీ, షుగర్ అదుపులో ఉంచుకోవాలని, ప్రతిరోజు వ్యాయామం చేయాలని, సూచించారు.

మహానాడులో సీపీఎం ప్రజాచైతన్య యాత్ర

తాడేపల్లి టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణం మహానాడు లో గురువారం సీపీఎం ప్రజాచైతన్య యాత్రను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వై నేతాజీ ప్రారంభించి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మహా నాడు కృష్ణానది ఒడ్డున ఉన్నవారికి పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం పేదల ఇల్లు తొలగించకుండా నదిలో వాల్ నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నది ఒడ్డున శ్మశాన వాటిక చుట్టూ గోడ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, గిరిజ, కరుణాకర్, బాషా, సత్యం, జగన్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని విధాలుగా మంగళగిరిని అభివృద్ధి చేస్తాం

- త్వరలోనే పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ
- నృసింహాలయం అభివృద్ధికి ప్రణాళికలు
- అత్యాధునిక సౌకర్యాలతో ప్రభుత్వాస్పత్రి
- అండర్ గ్రౌండ్ డ్రెయినేజీకి డీపీఆర్ సిద్ధం
- రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్

మంగళగిరి సిటీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో మంగళగిరి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం మంగళగిరి పట్టణంలోని ఓ హ్యాండ్లూమ్స్ షోరూం ప్రారంభించిన అనంత రం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సంద ర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ మంగళగిరి ప్రభుత్వ చెరువు, కొండ పోరంబోకు, రైల్వే భూము ల్లో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న వారికి పట్టాల ను పంపిణీ చేసేందుకు కసరత్తు ప్రారంభమైంద న్నారు. 'మంగళగిరి ప్రజల దశాబ్దాల నాటి కల వంద పడకల ఆస్పత్రి. కార్పొరేట్ హాస్పిటల్స్‌కు దీటుగా అత్యాధునిక సౌకర్యాలతో మంగళగిరిలో వంద పడకల ఆస్పత్రిని నిర్మిస్తాం. ఇప్పటికే డిజైన్లు కూడా



మంత్రి లోకేశ్‌ను సత్కరిస్తున్న తమ్మిశెట్టి జానకీదేవి దంపతులు

ఖరారయ్యాయి. త్వరలోనే పనులను ప్రారంభిస్తాం. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ డీపీఆర్ సిద్ధమైంది. మే నెల నుంచి పనులను ప్రారంభి స్తాం. ఏడాదిన్నరలో పూర్తిచేస్తాం. వాటర్ పైపులైన్లు, అండర్ గ్రౌండ్ గ్యాస్, విద్యుత్‌తోపాటు పార్కులు, కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తామని' తెలిపారు. మంగళగిరిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రాజధాని అమరావతి నుంచి రోడ్ నెం.13, 15ను మంగళగిరికి అనుసంధానించి ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిస్తామన్నారు. ప్రముఖ దేవాలయాల తరహాలో మంగళగిరి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్ర మంలో శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య, తమ్మిశెట్టి జానకీదేవి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మంగళగిరిలో ఘనంగా నృసింహస్వామి కల్యాణం



శ్రీలక్ష్మీనృసింహ స్వామి వారి కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న లోకేశ్ దంపతులు



ఉత్సవ పర్యవేక్షణాధికారి లీలాకుమార్



స్వామి వారి కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



స్వామి వారి కల్యాణానికి మధుపర్కాలు తీసుకెళుతున్న ఆలయ సిబ్బంది

ఘనంగా వీరభద్రస్వామి దేవస్థాన వార్షికోత్సవం

● పూజల్లో పాల్గొన్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



పూజల్లో పాల్గొన్న నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు

పెదనందిపాడు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్రస్వామి దేవస్థాన 8వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు బాపయ్యశర్మ స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. ఈ పూజా కార్యక్రమాల్లో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామంలో తాగునీటి చెరువులను బాగుచేయించుకోవాలని, అశిష్ సంస్థ వారితో మాట్లాడి చెరువును బాగుచేసేందుకు అవసరమైతే ఎంపీ ల్యాడ్స్ నుంచి నిధులు కేటాయిస్తానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు రావి శివరామకృష్ణయ్య, కమిటీ సభ్యులు లావు శివరామకృష్ణ, కుర్రా హరిబాబు, లావు మోహనకృష్ణ, ధూళిపాళ్ల మోహనరావు, పాటిబండ్ల నాగబాబు, లావు శ్రీనివాసరావు, నిమ్మగడ్డ గోపీ తదితరులు పాల్గొన్నారు.

● ట్రిపుల్ ఆర్, స్పెన్ బాధితులు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులుకు వినతి పత్రం అందజేశారు. అధిక వడ్డీలు ఆశచూపి కోట్ల రూపాయలు దోచుకుని మోసం చేశారని, తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై స్పందించిన ఎంపీ ఎస్పీకి ఫోన్ చేసి సత్వరమే న్యాయం చేయాలని ఆదేశించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మంగళగిరి సిటీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం పెదవడ్లపూడిలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను స్థానిక నేతలు గురువారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన సాదు దుర్గాదేవికి రూ.4,68,978లు, కొండపల్లి శ్రీలక్ష్మికి రూ.3,60,574లు, మేదరమెట్ల వెంకటేశ్వరరావుకు రూ. 30 వేల చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. మంత్రికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

దుగ్గిరాలయార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, మార్చి 13: దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డులో గురువారం జరిగిన వేలంలో 342 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.8,100, గరిష్ఠధర రూ.9,600, మోడల్‌ధర రూ.9,300 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.8,100, గరిష్ఠధర రూ.9,300, మోడల్‌ధర రూ.9,250 పలికాయి.

ఉప్పుటూరి చిన రాములు ట్రస్ట్ సేవలు అభినందనీయం

పుల్లడిగుంటలో చలివేంద్రం ప్రారంభం

వట్టిచెరుకూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రత, వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రధాన రహదారి పక్కన ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉప్పుటూరి చిన రాములు ఛారిటబుల్ ట్రస్ట్ తాగు నీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయటం హర్షణీయ మని వట్టిచెరుకూరు సీఐ రమా నాయక్ అన్నారు. మండలంలోని పుల్లడిగుంట గ్రామ సెంటర్‌లో పాత మద్రాసు, ఆర్‌అండ్‌బీ రోడ్డులో గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ఉప్పుటూరి రామ్‌చౌదరి సహ కారంతో వేసవి ఎండ తీవ్రతలను దృష్టిలో పెట్టు కొని బాట సార్లు, ద్విచక్ర వాహనదారుల దాహార్తి ని తీర్చేందుకు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం సీఐ రమా నాయక్



పుల్లడిగుంటలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ రమా నాయక్, దాత ఉప్పుటూరి చినరాములు

ప్రారంభించారు. చలివేంద్రాన్ని నిర్వహించేందుకు ప్రోత్సాహాన్ని అందించిన ఉప్పుటూరి చిన రాములును, సీఐ రమానాయక్, గ్రామ స్థులు, బాటసార్లు అభినందించారు. కార్యక్రమంలో సదా శివరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్ల రచనలు నేటి తరానికి ఆదర్శం

శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐలాపురం భాస్కర్

గుంటూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కవయిత్రి మొల్ల రచనలు నేటి తరానికి ఆదర్శమని ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐలాపురం భాస్కర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం కవయిత్రి మొల్ల 585వ జయంతి కార్యక్రమాన్ని ప్రత్తిపాడు మండలంలోని తుమ్మల పాలెంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలం అధ్యక్షుడు నిజాంపట్నం నాగబాబు అధ్యక్షత వహించారు. భాస్కర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మొల్ల జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించి జరుపుతుం



మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న శాలివాహన సంఘ జిల్లా అధ్యక్షుడు శివన్నారాయణ

డటం సంతోషకరమన్నారు. సంఘంజిల్లా అధ్యక్షుడు ఇందుర్తి శివన్నారాయణ మాట్లాడుతూ అమరావతి రాజధానిలో కవయిత్రి మొల్ల విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మామిళ్ళపల్లి సుబ్బారావు, పార్లెళ్ళ రమేష్, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడు (ఆంధ్రజ్యోతి) : స్థానిక సోమేశ్వరస్వామి దేవస్థానం వద్ద శాలివాహన సంఘం ఆధ్వర్యంలో కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, సభ్యులు నిజాంపట్నం సుబ్బారావు, నాగేశ్వరరావు, సామ్రాజ్యం, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ముఖ్యఅతిథులు

తాడికొండ(లాం)మార్చి 13(ఆంధ్రజ్యోతి): లాం చలపతి ఫార్మసీ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ అనే అంశంపై జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు గురువారం ముగిసింది. సదస్సులో సైంటి ఫిక్ సెషన్స్‌తో పాటు 2024-25 విద్యా సంవత్సరంలో వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు జ్ఞాపికలు బహూకరించారు. అంతర్జాతీయ సదస్సులో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థుల కు బహుమతులు అందజేశారు. అనంతరం చలపతి ఫార్మసీ కళాశాల 21వ వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంతేకాకుండా కార్యక్రమంలో చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు, సెక్రటరి వై సుజిత్‌కుమార్, ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు, నాట్కో ఫార్మ లిమిటెడ్ సీనియర్ జనరల్ మేనేజర్ వీరనారాయణ, ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ, ఎం హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభకు తరలిరావాలి

పెదనందిపాడు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ సభకు తరలిరావాలని జనసేన మండల అధ్యక్షుడు ఆముదాలపల్లి నరేంద్ర గురువారం పిలుపునిచ్చారు. పిఠాపురం నియోజకవర్గం చిత్రాడ వద్ద శుక్రవారం జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ సభకు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. సభకు వెళ్లేందుకు బస్సులు ఏర్పాటు చేశారన్నారు.

ఘనంగా బొడ్రాయి తిరునాళ్లు



కాకుమాను, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అప్పాపురంలో బొడ్రాయి తిరునాళ్ల గురువారం ఘనంగా జరిగింది. తిరునాళ్లలో భాగంగా బుధవారం సాయంత్రం చిన్నారులు, యువకులు కేరింతల నడుమ జలాభిషేకాలు జరిగాయి. గ్రామ వీధుల్లో రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

కాకుమాను, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తానని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ప్రత్తిపాడు నియోజకవర్గ అధ్యక్షుడు పర్చూరి బాజీబాబు అన్నారు. మండలపరిధిలోని లింగంగుంటపాలేనికి చెందిన పర్చూరి బాజీబాబు గురువారం విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో గురువారం మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫరూఖ్ షూబ్లీ వద్ద నుంచి నియామకపత్రం అందుకున్నారు.

619 అర్జీలు త్వరలో పరిష్కరిస్తాం

తాడికొండ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న 619 అర్జీలను త్వరలో విచారించి పరిష్కరిస్తామని ఎలెక్టోరోల్ రిజిస్ట్రేషన్ అధికారి గంగరాజు పేర్కొన్నారు. గురువారం తాడికొండ తహసీల్దార్ కార్యాలయంలో ఆల్ పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారం-6లు 204, ఫారం-7లు 69, ఫారం-8లు 346 అర్జీలు ఉన్నాయని తెలిపారు. త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో క్రమశిక్షణ

కాకుమాను, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో క్రమశిక్షణ అలవడుతుందని స్కౌట్స్ జిల్లా సమన్వయకర్త ఏడుకొండలు అన్నారు. కాకుమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం స్కౌట్స్ అండ్ గైడ్ యూనిట్‌ను ప్రారంభించారు. బాలురు, బాలికలతో గైడ్ కెప్టెన్ ఉమాదేవి ప్రతిజ్ఞ చేయించారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

స్వచ్ఛ తెనాలి పోటీ

తెనాలి, మారీసుపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘ పరిధిలోని 40వార్డులలోని వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలకు స్వచ్ఛ తెనాలి చాలెంజింగ్ కాంపిటేషన్‌ను నిర్వహిస్తున్నామని మునిసిపల్ కమిషనర్ శేషన్న గురువారం తెలిపారు. ఈ పోటీ ఈ నెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగనాథ్ నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో భాగంగా వార్డులలో ప్రతిరోజు ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ, మూడు బుట్టల విధానం అమలు, పారిశుధ్య కార్మికుల హాజరు, పరిశుభ్రతలపై ప్రజల స్పందన, సేఫ్టీ యూనిఫాం ధరించడంపై, వార్డు శానిటేషన్ సెక్రటరీ వార్డుకు సంబంధించి కార్యక్రమాల అమలుపై కమిటీ వార్డులలో పర్యటించి 100 మార్కులు సాధించిన వారికి ప్రత్యేక బహుమతులు అందిస్తామన్నారు. ప్రథమ బహుమతి రూ. 15,000లు, రెండో బహుమతి రూ.12,000లు మూడో బహుమతిగా రూ.10,000లు అందిస్తామని కమిషనర్ శేషన్న పేర్కొన్నారు.

అపరిశుభ్రతకు నిలయాలుగా ఖాళీ స్థలాలు

● చిట్టడవిని తలపిస్తూ, మురుగు నిలిచి దోమలకు నిలయాలుగా స్థలాలు
● ఇక్కట్లు పడుతున్న స్థానికులు



మురుగునీరు చేరి, గడ్డి పెరిగి దోమలకు ఆవాసాలుగా, వ్యర్థాలతో డంపింగ్ యార్డును తలపిస్తున్న ఖాళీస్థలాలు

తెనాలి, మారీసుపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల మధ్య ఉన్న ఖాళీస్థలాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. పట్టణ పురపాలక సంఘం పరిధిలోని 40 వార్డుల్లో వేలాదిమంది నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. మునిసిపాలిటీ ఆయా వార్డులలోని ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పారిశుధ్యం తాగునీరు వంటి పలు సురక్షిత చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే పట్టణంలోని నివాసాల మధ్య పలు ప్రాంతాలలో ఖాళీస్థలాలు ఉండటంతో పక్కన నివసించే వారికి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఆయా స్థలాలలో రోడ్ల వెంబడి మురుగునీరు చేరి పిచ్చిమొక్కలు, ముళ్ల కంపలు పెరిగి అడవిని తలపిస్తున్నాయి. అంతేకాకుండా దోమలకు, విషపురుగులకు ఆవాసాలుగా మారి స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. మరికొన్ని చోట్ల స్థానిక నివాసితులు తమ ఇంటిలోని వ్యర్థాలను సైతం అందులోనే వేస్తుండటంతో డంపింగ్ యార్డును తలపిస్తున్నాయి. మునిసిపల్ అధికారులు ఖాళీస్థలాల నిర్వహణపై ప్రణాళికలను రూపొందించడం మినహా ఆచరణకు నోచుకోకపోవడంతో రోజు రోజుకు సమస్య జటిలం అవుతుందే తప్ప పరిష్కారానికి నోచుకోకపోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. స్థానికులు ఖాళీస్థలాల సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకువెళితే స్పందించినట్లు వచ్చి ఆయా ఖాళీస్థల యజమానులకు నోటీసులు జారీచేసి చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

ఖాళీస్థలాల పక్కన ఇండ్లలో నివసించేవారు భయం భయంగానే గడుపుతున్నారు. అధికారులు ఖాళీస్థలాలపై ప్రత్యేక దృష్టిపెట్టి ప్రజలు ప్రశాంతంగా జీవించేలా చర్యలు చేపట్టాలని పలు ప్రజా సంఘాల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రామతత్వాన్ని ఆచరిస్తే ఆదర్శవంతమైన సమాజం

సహస్రావధాని గరికపాటి



గరికపాటిని సత్కరిస్తున్న అర్చకులు

తెనాలి అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రామతత్వాన్ని ఆచరిస్తే ఆదర్శవంతమైన రూపొందుతుందని సహస్రావధాని గరికపాటి నరసింహారావు చెప్పారు. తెనాలి తాలూకా జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న శ్రీరామ నామ పారాయణ మహాయజ్ఞ పూర్ణాహుతి ఉత్సవాలలో భాగంగా గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఆయన ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఆయన ప్రవచనం వినేందుకు భారీగా భక్తులు తరలి వచ్చారు. పరమాత్మతత్వాన్ని అర్థం చేసుకుని ప్రతి మనిషి వ్యవహరించాలని, మనుషులుగా ప్రవర్తించాలని, పేదలకు ఉన్న దాంట్లోనే సాయం అందించాలన్నారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా భార్యభర్తల అనుబంధం వీడకూడదని, రాముడు అడవికి వెళితే సీతమ్మ తల్లి ఆయనను వదిలేసిందా తెలుసుకుని ప్రవర్తించాలన్నారు. సకల జీవులను ఆదరించే ధర్మం పాటించాలని, అజ్ఞానం వీడాలని చెప్పింది విని వెళితే సరిపోదని, ఆచరించి చూపితేనే ప్రయోజనకరమన్నారు. హోలీ పండుగ అర్థం పండుగ మారిపోతుందని, సహజ రంగులు వదిలి కృత్రిమ రంగులు చల్లుకుని చర్మవ్యాధులు తెచ్చుకుంటున్నారని చెప్పారు. రామనామం, సీతామాత ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను ఉదాహరణగా భక్తులకు వివరించారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగనాథ్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగనాథ్, కమిషనర్ శేషన్న తదితరులు

తెనాలి, మారీసుపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకుందామని అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగనాథ్ అన్నారు. గురువారం స్థానిక మార్కెట్ సెంటర్‌లోని మునిసిపల్ కార్యాలయం నుంచి సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనపై మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగనాథ్ పాల్గొని జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నిషేధించామన్నారు. ఈ ప్లాస్టిక్ ఉత్పత్తుల వలన పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందన్నారు. అందుకే సింగల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను నిషేధించామన్నారు. కమిషనర్ శేషన్న మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను విక్రయించిన వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల బదులుగా గుడ్డ, కాగిత సంచులను వినియోగించాలని కోరారు. పట్టణ ప్రజల సహకారంతోనే స్వచ్ఛ తెనాలి సాధ్యమవుతుందన్నారు.

కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈ శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు మేలు రకాల విత్తనాలను అభివృద్ధి చేసుకోవాలి

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

కొల్లిపర, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రైతులు మేలు రకాల విత్తనాలను అభివృద్ధి చేసుకోవాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం మండల పరిధిలోని మున్నంగిలో ఎన్‌ఆర్‌ఐ సీడ్స్ ఆధ్వర్యంలో హైబ్రీడ్ జొన్న మహేంద్ర రకంపై నిర్వహించిన క్షేత్రప్రదర్శనలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్ని ప్రసంగించారు. కార్యక్రమానికి ఎన్‌ఆర్‌ఐ సీడ్స్ ఆర్‌ఎం సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మేలు రకాల విత్తనాల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏవో వెంకట్రావు, ఏఈవో మురళి, టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, టీడీపీ నాయకులు ఆళ్ళ వీరారెడ్డి, బొమ్ము శివారెడ్డి, ఆళ్ళ సురేష్‌రెడ్డి, కొరారు అంజనేయులు, దాసరి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో కొల్లిపర విద్యార్థి ప్రతిభ




పోటీల్లో గెలుపొందిన కీర్తిప్రియకు బహుతులు అందజేస్తున్న నిర్వాహకులు

కొల్లిపర, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అత్తోట ప్రాథమిక పాఠశాల 3వ తరగతి విద్యార్థి విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి విబా లీఫ్ ఫర్ వర్స్ చాంపియన్ షిప్ పోటీల్లో ద్వితీయ స్థానం పొందింది. ఈ సందర్భంగా దండా కీర్తిప్రియకు సైకిల్, స్టడీ టేబుల్ సర్టిఫికెట్‌ను నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయిని ఎల్.అరుణకుమారిని, విద్యార్థి కీర్తిప్రియలను మండల విద్యాశాఖాధికారులు సాల్మన్‌రాజు, ఝాన్సీలతలు, ఉపాధ్యాయులు అభినందించారు.

నయనానందకరంగా జనార్దనస్వామి కల్యాణం

పొన్నూరు టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండముది గ్రామంలోని రాజేశ్వరి సమేత జనార్దనస్వామి వార్షిక కల్యాణోత్సవం బుధవారం రాత్రి నయనానందకరంగా సాగింది. స్వామివారి కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారి మూలవిరాట్‌తో పాటు ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై స్వామివార్ల ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించి కల్యాణాన్ని వైభవంగా జరిపారు. స్వామివారి కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయాన్ని రంగు రంగుల విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ నిర్వాహకులు కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా మొగదారమ్మ తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో మొగదారమ్మ

పొన్నూరు టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతలపూడిలోని గ్రామ దేవత మొగదారమ్మతల్లి తిరునాళ్ల గురువారం వైభవంగా జరిగాయి. అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకుని ఉదయం ఆలయంలో అమ్మవారికి జలాభిషేకాలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. మహిళలు పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం గ్రామ యువత ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రభల ఉత్సవం జరిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పురపాలక సంఘంలో విలీనం వద్దంటూ తీర్మానాలు

పొన్నూరు టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పురపాలక సంఘంలో తమ గ్రామాలను విలీనం చేయవద్దని చింతలపూడి, వడ్డిముక్కల, పెద ఇటికంపాడు, గ్రామాల వాసులు తీర్మానాలు చేసి సంతకాలు చేశారు. విలీన గ్రామాలలో గురువారం గ్రామసభలు జరిగాయి, చింతలపూడిలో ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విలీనానికి వ్యతిరేకంగా సంతకాలు చేశారు. వడ్డిముక్కల గ్రామంలో ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో జరిగిన గ్రామ సభలోనూ విలీనానికి వ్యతిరేకంగా సంతకాల సేకరణను ప్రజలు నిర్వహించారు. గత ఐదేళ్లుగా విలీనం పేరుతో తమకు ఎదురైన ఇబ్బందులను గ్రామస్థులు గ్రామసభల ముందు ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ ప్రజా అభిప్రాయాన్ని నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలియజేశారు. ఈ గ్రామ సభలో మూడు గ్రామాల వాసులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవ కార్యక్రమాలు

తెనాలి అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్, తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక మున్సిపల్ హైస్కూల్‌లో తాగునీటికి బోరు, మోటారు, ఫర్నిచర్, డైనింగ్ హాలు ఆధునికీకరణ, క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులకు కళ్లజోళ్ల పంపిణీ చేశారు. వీరస్థలి డాక్యుమెంటరీలో కథా నాయకుడు దర్శి జీవన్, నటి వసంత యామినిలను సత్కరించారు.

కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలు సకాలంలో చెల్లించాలని నిరసన

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌స్మార్ట్ మీటర్‌ల ఇన్‌స్టాలేషన్ కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనాలు సకాలంలో చెల్లించాలని గురువారం నిరసన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని నారాకోడూరు గ్రామం వద్ద ఉన్న స్మార్ట్ మీటర్ల గోడౌన్ వద్ద ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. జిల్లాలో విద్యుత్ మీటర్‌లను స్మార్ట్ మీటర్లగా మార్చేందుకు హెచ్‌ఆర్, క్విస్ సంస్థలు, కాంట్రాక్టు సిబ్బంది తమను ఉద్యోగులగా నియమించుకున్నట్లు చెప్పారు. ఆఫర్ లెటర్ ఇచ్చినప్పుడు తెలిపిన వేతనాలు సక్రమంగా చెల్లించకుండా విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. సమయపాలన లేకుండా ఒత్తిడి చేయడంతోపాటు లక్ష్యాలు పూర్తి చేయకపోతే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నట్లు ఆరోపించారు.

ఘనంగా గ్రామ దేవత తిరునాళ్ల

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శలపాడులోని నాగారమ్మ, నాంచారమ్మ, పోతురాజు స్వామి తిరునాళ్ల గురువారం ప్రారంభం అయింది. ఈ సందర్భంగా అమ్మవార్ల విగ్రహాలకు జలాభిషేకాలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో అమ్మవార్ల జ్యోతుల ఊరేగింపు జరిగింది. విద్యుత్ ప్రభల ఉత్సవం నిర్వహించారు.



రాధాకృష్ణను సన్మానిస్తున్న వర్సిటీ ఉద్యోగులు

రంగస్థల నటుడు ఆచార్య రాధాకృష్ణకు సన్మానం

పెదకాకాని, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రంగస్థల నటుడు ఆచార్య తొర్లపాటి రాధాకృష్ణకు గురువారం సన్మానం జరిగింది. వర్సిటీలోని పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ అండ్ థియేటర్ ఆర్ట్స్ విభాగంలో విద్యార్థులకు నటన, హావభావాలు, భావవ్యక్తీకరణలపై అవగాహన కల్పించారు. తన పర్యవేక్షణలో వందలాదిమంది కళాకారులను తీర్చిదిద్దిన ఘనత దక్కించుకున్నారు. తన అనుభవాలను పంచుకున్న తరుణంలో శాఖాధిపతి డాక్టర్ ఎల్వీ నాగభూషణరావు సత్కారం చేశారు.

కొనసాగుతున్న సదరం రీ వెరిఫికేషన్

తెనాలి రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో నిర్వహిస్తున్న సదరం రీ వెరిఫికేషన్ ప్రక్రియ రెండో రోజు కొనసాగింది. దాదాపుగా వివిధ విభాగాలకు చెందిన 100మంది హాజరై వైకల్య శాతం పరీక్షలు చేయించుకున్నారు. పరీక్షల అనంతరం వైకల్య శాతాన్ని వైద్యులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

నేడు రీ వెరిఫికేషన్ నిలుపుదల

వారంలో మూడు రోజులపాటు తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలల్లో నిర్వహిస్తున్న సదరం రీ వెరిఫికేషన్ ప్రక్రియ శుక్రవారం నిలుపుదల చేసినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపారు. పబ్లిక్ హాలిడే కావడంతో సదరం రీ వెరిఫికేషన్ జరగదన్నారు. తిరిగి 19వ తేదీ నుంచి బుధ, గురు, శుక్రవారాల్లో యథావిధిగా జరగనుందని పేర్కొన్నారు.

పరిశోధన పత్రాలు సమర్పించిన అధ్యాపకులకు వీసీ అభినందనలు

పెదకాకాని, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ డి.రవిశంకర్ రెడ్డి పర్యవేక్షణలో పరిశోధన చేస్తున్న విద్యార్థులను ఇన్చార్జి వీసీ ఆచార్య కే.గంగాధరరావు గురువారం అభినందించారు. అంతర్జాతీయ సదస్సులో పరిశోధన పత్రాలు సమర్పించినందుకు ఆయన విద్యార్థులను అభినందించారు. డాక్టర్ రవి శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో ఎం.యశోదీపిక మతిమరుపు వ్యాధిపై, టీ.మౌనిక క్షయవ్యాధిపై పరిశోధన పత్రాలను సమర్పించారు. ఊటీలోని జేఎస్ఎస్ ఫార్మసీ కళాశాల, గుంటూరులోని చేబ్రోలు హనుమయ్య కళాశాల నిర్వహించిన ఈ అంతర్జాతీయ సదస్సులలో వీరు పరిశోధన పత్రాలు సమర్పించారు. వీరి పరిశోధన పత్రాలకు ద్వితీయ, తృతీయ బహుమతులు వచ్చినట్లు వివరించారు. ఇటీవల మంగళయాటన్ విశ్వవిద్యాలయంలో అసోసియేషన్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ ఫార్మసీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో మధుమేహ వ్యాధిపై పరిశోధన చేసి సమర్పించిన పరిశోధన పత్రానికి తృతీయ బహుమతితో పాటు యంగ్ సైంటిస్ట్ అవార్డును రవిశంకర్‌రెడ్డి పొందారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రమీలారాణి, ఫార్మసీ విద్యార్థులు ఎం.భార్గవి, జి.సత్యానందరావు, రాజురమేష్, రూస ప్రాజెక్టు పరిశోధన విద్యార్థిని ఏ.మేఘనలను అభినందించారు.

163 మంది ఏఎస్ఎన్ విద్యార్థులకు ఉద్యోగాలు

తెనాలి అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో చదువుతున్న 163మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయి. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యా సంస్థల ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ, మూడు కంపెనీలు తమ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించాయన్నారు. స్పీకింగ్ ట్రీ, ఈఎస్ఎల్, ఈ ఫర్య కంపెనీలకు ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.18 నుంచి రూ.21వేల వరకు వేతనం లభిస్తుందన్నారు. ప్రిన్సిపాల్ కొలసాని రాంచంద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మృతులకు ఎమ్మెల్యే నివాళి

పొన్నూరు టౌన్, (చేబ్రోలు), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పలు కారణాలతో ఇటీవల మృతి చెందిన టీడీపీ నాయకులకు ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ గురువారం నివాళులు అర్పించారు. మండల పరిధిలోని మంచాల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రైతు విభాగం కార్యదర్శి చిమటా సీతారామయ్య మృతి చెందారు. అలాగే గొడవర్రు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఈసమ్మ భర్త ఆరుమళ్ల ముక్కంటి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మృతుల కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి సంతాపం తెలియజేశారు. స్థానిక టీడీపీ నాయకులు మృతుల గృహాలకు వెళ్లి వారి మృతదేహాలకు నివాళులు అర్పించారు. మృతులు కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చేబ్రోలు కొత్తరెడ్డిపాలెం విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో జరిగింది. గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు జరిపారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించారు. అర్చకస్వాములు మంత్రోచ్ఛరణల నడుమ వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణక్రతువు నిర్వహించారు. ఈ కల్యాణోత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వర్సిటీలో ఘనంగా జనసేన ఆవిర్భావ వేడుకలు

పెదకాకాని, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు వర్సిటీ మెయిన్ గేట్ ఎదుట గురువారం ఘనంగా జరిగాయి. యూజీ కోర్సుల సమన్వయకర్త ఆచార్య ఎస్వీ కృష్ణారావు, యడ్ల రాధాకృష్ణ, జవ్వాది శ్రీనివాసరావు, రాంబాబు, వెంకటేశ్వరరావు, నాగరాజు తదితరులు ఈ వేడుకలలో పాల్గొన్నారు.

విరిగిన విద్యుత్ స్తంభం తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



విరిగిన విద్యుత్ స్తంభాన్ని తొలగిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

తెనాలి రూరల్, మార్చి13 (ఆంధ్రజ్యోతి): ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం గురించి ఈ నెల 12న ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. మండలంలోని సంగంజాగర్లమూడి నుంచి శేకూరు రోడ్డు వెళ్లే రైల్వేగేట్ల సమీపంలోని పంప్‌హౌస్‌కు వెళ్లే మార్గంలో విద్యుత్ స్తంభం విరిగి లైన్ల వైర్ల సాయంతో వేలాడుతున్న విషయాన్ని ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు గురువారం ఆ ప్రాంతాన్ని పరిశీలించి విరిగిన స్తంభాన్ని తొలగించి నూతన స్తభం ఏర్పాటుచేసి సురక్షిత చర్యలు చేపట్టారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఆంధ్రజ్యోతికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.



బాలస్వామికి స్వాగతం పలుకుతున్న భక్తులు

15న తిరుమలకు బాలస్వామి పాదయాత్ర

తెనాలి అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సాలీగ్రామ మఠం ట్రస్ట్ శ్రీవిద్యా పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతీస్వామి ఈ నెల 15న తిరుమలకు పాదయాత్ర చేయనున్నారు. వైకుంఠపురం ఆలయం నుంచి పాదయాత్ర ప్రారంభిస్తారని భక్తులు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం పట్టణంలో పర్యటించారు. లోక కల్యాణం నిమిత్తం పాదయాత్ర చేపట్టారని భక్తులు పలు చోట్ల ఆయనకు స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేశారు.



సీతారామ చంద్ర పట్టాభిషేకం చేస్తున్న అర్చకులు

ఘనంగా సీతారామచంద్రస్వామి పట్టాభిషేకం

తెనాలి అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కొత్తపేటలోని తాలూకా జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం శ్రీసీతారామ చంద్రస్వామి పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు. శ్రీవిఖనస శ్రీనివాస ట్రస్ట్, పంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తన బృందం సేవ సమితుల ఆధ్వర్యంలో అష్టోత్తర శత కోటి, శ్రీరామనామ పారాయణ, మహాయజ్ఞ పూర్ణాహుతి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా హాజరైన భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ శిల్ప ప్రసంగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో కల్యాణాన్ని తిలకించి ప్రవచనాన్ని ఆలకించారు. ప్రవచనకర్త ములుకుట్ల విశ్వనాథశర్మ పట్టాభిషేకం విశిష్టత వివరించారు. ఆగమ పండితులు నారాయణగోవర్ధన్, లక్ష్మీరఘురామ్, నాగమారుతి, శ్రీనివాసమూర్తి, కిరణ్‌కుమార్, సురేష్ బృందం వైదిక క్రతువు నిర్వహించారు. జంజం రామారావు దంపతులు సహకారం అందించారు. మూర్తి అనూరాధ, వెంకటేశ్వరరావు, బాలకృష్ణ, చంద్రశేఖర్, వెంకటేష్, సోమశేఖర్ పర్యవేక్షించారు.

పోతురాజు ట్రస్ట్ సేవలు అభినందనీయం


● ఎంపీడీవో అత్తోట దీప్తి



ఉద్యోగులకు చీరలు పంపిణీ చేస్తున్న దీప్తి, ట్రస్ట్ సభ్యుడు చక్రవర్తి తదితరులు

తెనాలి రూరల్, మార్చి13 (ఆంధ్రజ్యోతి): పొన్నెకంటి పోతురాజు ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎంపీడీవో అత్తోట దీప్తి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలు పోటీల్లో గెలుపొందిన మహిళా ఉద్యోగులకు పొన్నెకంటి పోతురాజు ట్రస్ట్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీడీవో అత్తోట దీప్తి పాల్గొని ఉద్యోగులకు చీరలు అందజేశారు. కొలకలూరు జనసేన పార్టీ, పొన్నెకంటి పోతురాజు ట్రస్ట్ సముక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ట్రస్ట్ నిర్వాహక సభ్యుడు పొన్నెకంటి చక్రవర్తి పేర్కొన్నారు. కార్యక్రమంలో కొలకలూరు జనసేన పార్టీ నాయకులు తుపాకుల ప్రసాద్, డ్వాక్రా సీనియర్ యానిమేటర్లు నాగలక్ష్మి, కుసుమ, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

చెంచుపేటలో ఘనంగా ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు



స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు

తెనాలి అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చెంచుపేటలోని శ్రీగోదా పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 9న ప్రారంభమైన ఉత్సవాలు 17న ముగుస్తాయి. ఉత్సవాలలో భాగంగా గురువారం యాగశాల ప్రవేశం, కలశ స్థాపన, నిత్య పూర్ణాహుతి, ధ్వజారోహణ, నిత్యహోమం, విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. 14న నిత్యహోమాలు, 15న స్వామి వారి కల్యాణ మహోత్సవం, 16న గరుడోత్సవం, 17న మహా పూర్ణాహుతి వసంతోత్సవం, అన్నదానం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఎమ్మెల్యే నరేంద్రపై కేసు కొట్టివేతపై హర్షం

పొన్నూరు టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): 2007వ సంవత్సరంలో అక్రమ మైనింగ్‌పై ఉద్యమించిన సమయంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌పై నమోదైన కేసును కొట్టివేయడంపై గురువారం పొన్నూరు నియోజకవర్గంలో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. 2007లో ఓబులాపురం ప్రాంతంలో అక్రమ మైనింగ్‌ను పరిశీలించేందుకు తమ నిరసన తెలిపేందుకు వెళ్లిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌తో సహా మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు తదితరులపై కేసు నమోదైంది. గత 17 సంవత్సరాలుగా విజయవాడ ప్రజా ప్రతినిధుల కోర్టుకు ఎమ్మెల్యే నరేంద్రకుమార్ హాజరవుతున్నారు. గురువారం కేసు కొట్టివేసిన సందర్భంగా నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.